https://teluguislam.net



# ఇస్లామీయ ప్రథమ నిర్ణయాత్మక సంగ్రామం

# బద్ర్ సంగ్రామం (గజ్వయె బద్రె కుబ్రా)

## గజ్వాకు పురికొల్పిన కారణాలు

'గజ్వయె ఉషైరా'లో, ఖురైష్‌కు చెందిన ఓ వర్తక బిడారం మక్కా నుండి సిరియా వెడుతూ మహాప్రవక్త (స)గారి చేతిలో పడకుండా తప్పించు కొనిపోయిందన్న విషయం మనం ఇదివరకే చదువుకున్నాం. ఈ బిడారమే సిరియా నుండి తిరిగివస్తుందని తెలిసి దైవప్రవక్త(స), తల్హా బిన్ ఉబైదుల్లాహ్(ర) మరియు సయీద్ బిన్ జైద్ (ర)లకు పరిస్థితులేమిటో తెలుసుకురమ్మని ఉత్తర దిశగా పంపించారు. ఈ ఇద్దరు సహాబీలు 'హవార్' అనే ప్రదేశం వరకు వెళ్ళి అక్కడనే ఆగిపోయారు. అబూ సుఫ్యాన్ ఆ బిడారాన్ని తీసుకొని ఆ మార్గాన వెళ్ళగా వీరు పరుగున మదీనాకు వచ్చి విషయం మహాప్రవక్త(స)కు చెప్పారు.

ఈ బిడారంలో మక్కావాసులకు చెందిన బోలెడు ధనం ఉంది. అంటే, ఒక వేయి ఒంటెలు, ఆ ఒంటెలపై యాభై వేల దీనార్ల (రెండు వందల అరవై రెండున్నర కిలోల బరువు బంగారం) విలువ గల వర్తక సామగ్రి ఉంది. దాన్ని రక్షించడానికి కేవలం నలభై మందే ఉన్నారు.

మదీనావాసులకు ఇది స్వర్ణావకాశం. అప్పటి పరిస్థితులు ధనలేమికి గురి అయి ఉన్నాయి. ఈ పరిస్థితి మదీనావాసులకు సైనికపరంగా, రాజకీయంగా, ఆర్థికంగా కృంగదీస్తున్న పరిస్థితి. అందువలన ప్రవక్తశ్రీ(స), "ఈ ఖురైష్ కాన్వాయ్ ధనంతో వస్తోంది కాబట్టి దాన్ని పట్టుకోడానికి వెళ్ళండని, బహుశా అల్లాహ్ మీ కోసం యుద్ధధనాన్ని పంపించి ఉంటాడని" ప్రకటించారు.

అయితే ప్రవక్త శ్రీ(స) ఎవ్వరినీ వెళ్ళడానికి మాత్రం బలవంతపెట్టలేదు.

https://teluguislam.net



దీన్ని కేవలం ప్రజల ఇష్టంపై వదిలేశారు. ఈ ప్రకటన చేసినప్పుడు వర్తక బిడారానికి బదులు ఖురైషుల సైన్యంతో బద్ర్ మైదానంలో భీకర యుద్ధం జరగబోతుందన్న విషయం తెలియదు. అందుకనే చాలా మంది సహాబా(ర) మదీనాలోనే ఉండిపోయారు. వారు అనుకున్నదాని ప్రకారం, మహాప్రవక్త(స) గారి ఈ ప్రయాణం గతంలోని సైనిక ఆపరేషనుల్లాంటిదే అని తలచడం. అందుకని వారు ఈ గజ్వాలో చేరకపోయినా మందలించడం జరగలేదు.

## ఇస్లామీయ సైనికశక్తి మరియు నాయకత్వ విభజన

మహాప్రవక్త (స) బయలుదేరేటప్పుడు ఆయన(స) వెంట మూడొందల మంది కంటే కొంత ఎక్కువ మంది ఉన్నారు (అంటే 313 లేదా 314 లేదా 317 మంది). వీరిలో 82 లేదా 83 లేదా 86 మంది ముహాజిర్లు, మిగతావారు అన్సారులు. అన్సారుల్లోను 61 మంది అవస్ తెగకు చెందినవారు. 170 మంది ఖజ్రజ్ తెగవారు. ఈ గజ్వాకు వెళ్ళే సైనికులు ఎలాంటి యుద్ధ సన్నాహం లేకుండా బయలుదేరినవారు. పటాలం మొత్తంలో కేవలం రెండు గుర్రాలున్నాయి (ఒకటి హజ్రత్ జుబైర్(ర) బిన్ అవామ్‌గారి గుర్రం, మరొకటి హజ్రత్ మిగ్దాద్(ర) బిన్ అస్వద్ కందీగారి గుర్రం). దీనికితోడు డెబ్బై ఒంటెలు, ఒక్కొక్క ఒంటెపై ముగ్గురేసి వ్యక్తులు వంతులవారీగా స్వారీ చేస్తున్నారు. ఓ ఒంటె దైవప్రవక్త (స), హజ్రత్ అలి(ర) మరియు హజ్రత్ ముర్సిద్(ర) బిన్ అబీ ముర్సిద్ భాగంలో ఉంది. దీనిపై ఈ ముగ్గురు వంతులవారీగా స్వారీ చేస్తూ వెళ్ళారు.

మదీనా నాయకత్వాన్నీ మరియు నమాజు చేయించే బాధ్యతను మొదట హజ్రత్ ఇబ్నె మక్తూమ్(ర)గారికి అప్పగించడం జరిగింది. కాని మహాప్రవక్త (స) 'రౌహా' అనే ప్రదేశానికి చేరిన తరువాత ఆయన అబూ లుబాబా బిన్ అబ్దుల్ ముబ్జిర్ (ర) గారికి మదీనా నాయకత్వాన్ని అప్పగించి పంపించారు. సైన్యాన్ని రెండు దళాలుగా విభజించడం జరిగింది. ఒక దళం ముహాజిర్ల దళం, మరొకటి అన్సారుల దళం. ముహాజిర్ల పతాకం హజ్రత్ అలి(ర)కు, అన్సారుల పతాకాన్ని హజ్రత్ సఅద్ బిన్ ముఆజ్ (ర)కు, అన్ని దళాల పతాకం హజ్రత్ ముస్అబ్ బిన్ ఉమైర్ అబ్దరీ (ర)కు ఇవ్వడం జరిగింది. ఇది శ్వేత వర్ణ పతాకం. 'మైమనా' (కుడి పార్శ్వం) కమాండరుగా

https://teluguislam.net



హజ్రత్ జుబైర్ బిన్ అవామ్ (ర) మరియు 'మైసరా' (ఎడమ పార్శ్వం) కమాండరుగా హజ్రత్ మిగ్దాద్ బిన్ అమ్రూ (ర) లను నియమించడం జరిగింది- మనం ఇదివరకే చెప్పుకున్నట్లు పూర్తి సైనిక దళంలో కేవలం ఇద్దరే గుర్రపు రౌతులున్నారు - 'సాకా' (మధ్య భాగం) కమాండరుగా హజ్రత్ ఖైస్ బిన్ అబీ సఅసాకు అప్పగించడం జరిగింది. ఇక ఈ దళానికి సర్వసైన్యాధ్యక్షులుగా స్వయంగా మహాప్రవక్త(స)గారే వ్యవహరించారు.

## బద్ర్ వైపునకు ప్రయాణమైన ఇస్లామీయ సైనిక దళం

మహాప్రవక్త (స) ఈ అసంపూర్ణమైన సైన్యాన్ని వెంటగొని మదీనా ముఖ ద్వారం నుండి మక్కాకు వెళ్ళే రహదారిపై ప్రయాణిస్తూ 'బిఇరె రౌహా' వరకు వెళ్ళారు. అక్కడి నుండి ముందుకు కదిలి మక్కా మార్గాన్ని ఎడమ వైపునకు వదిలేసి కుడి ప్రక్కకు మళ్ళి 'నాజియా'చేరారు (ఆయన గమ్యస్థానం బద్ర్). నాజియా ఓ మూల మలుపు తిరిగి 'రహ్కాన్'లోయను దాటారు. ఇది 'నాజియా' మరియు 'సఫ్రా'కనుమ నడుమన గల లోయ. ఇది దాటి సఫ్రా కనుమ, ఆ కనుమ దాటి సఫ్రా లోయ దాపుకు వెళ్ళిపోయారు. అక్కడి నుండే ఆయన (స), జుహైనా తెగకు చెందిన ఇద్దరు మనుషుల్ని బద్ర్ పరిస్థితులేమిటో తెలుసుకురండని పంపించడం జరిగింది. ఈ ఇద్దరు వ్యక్తులు బసీస్ బిన్ ఉమర్ మరియు అద్దీ బిన్ అబిజ్జగ్బాలు. వీరు ఆ వర్తక బిడారం ఆచూకీ తెలుసుకొని రావడానికి బయలుదేరినవారు.

## మక్కాలో ప్రమాద ఘంటికలు

మరో ప్రక్క, వర్తక బిడారాన్ని రక్షించుకుంటూ వస్తున్న అబూ సుఫ్యాన్ ఎంతో జాగరూకతను అవలంబిస్తూ కదుల్తున్నాడు. మక్కా మార్గం ప్రమాద భూయిష్టమైనదనే విషయం అతనికి బాగా తెలుసు. అందుకని అతను పరిస్థితులను బేరీజు వేసుకోవడానికి వేగులను పంపిస్తున్నాడు. అతనికి తారసపడుతున్న ఒంటెల బిడారాలను ఆపి పరిస్థితిని ఆకళింపు చేసుకుంటున్నాడు. ఇలా అతనికి, దైవప్రవక్త(స) మరియు ఆయన అనుచరగణం తన బిడారంపై దాడి చేయడానికి సమాయత్తమవుతున్న విషయం తెలిసిపోయింది. ఇది తెలుసుకున్న వెంటనే అతను జమ్‌జమ్ బిన్ అమ్రూ గిఫారీ

https://teluguislam.net



అనే వ్యక్తికి ప్రతిఫలం ముట్టజెప్పి బిడారాన్ని రక్షించమని ఖురైషులకు కబురు పంపించాడు. జమ్‌జమ్ ఎంతో వేగంగా మక్కాకు వచ్చి, అరబ్బు సంప్రదాయం ప్రకారం తన ఒంటె ముక్కును కోశాడు, ఒంటె అంబారీని బోర్లించాడు, తన చొక్కా చించుకుని మక్కా లోయలో ఆ ఒంటెపై నిలబడి, "ఓ ఖురైష్ వర్గమా! మీ వర్తక బిడారం.....మీ వర్తక బిడారం.....అబూ సుఫ్యాన్ వెంట తెస్తున్న మీ వర్తక బిడారంపై ముహమ్మద్ (స) మరియు ఆయన అనుచరులు దాడి చేయడానికి సిద్ధంగా ఉన్నారు. దాన్ని మీరు పొందగలరన్న నమ్మకం నాకు లేదు. రక్షించుకోండి...రక్షించుకోండని" పెద్దపెట్టున అరవనారంభించాడు.

## మక్కావాసుల యుద్ధ సన్నాహాలు

జమ్‌జమ్ అరుపులు విన్న మక్కా ప్రజలు పరుగున అక్కడికి చేరారు. వారు పరస్పరం, "ముహమ్మద్(స) మరియు ఆయన అనుచరులు ఈ బిడారం కూడా ఇబ్నె హజ్రమీ బిడారంలాంటిదే అనుకొని ఉన్నారేమో? కాదు! ఎన్నటికీ కాదు! దైవసాక్షి! వారికి తెలిసిపోతుంది మా విషయం వేరు అన్నది" అని అనుకోనారంభించారు. ఇప్పుడు మక్కాలో మిగిలింది రెండే రెండు వర్గాలకు చెందినవారు. ఒక వర్గం యుద్ధం కోసం బయలుదేరే వర్గం. మరొక వర్గం తాను యుద్ధానికి బయలుదేరలేకపోయినప్పటికీ తన వంతుగా ఎవరినో ఒకరిని యుద్ధానికి పంపే ప్రయత్నంచేసే వర్గం. ఇలా దాదాపు అందరూ యుద్ధం కోసం బయలుదేరిన వాళ్ళే. ముఖ్యంగా మక్కా గౌరవనీయుల్లో ఏ ఒక్కడూ వెనుకన ఉండిపోలేదు. కేవలం ఒకే ఒక వ్యక్తి, అబూ లహబ్, అతను తనకు బదులుగా తన రుణగ్రస్తుణ్ణొకణ్ణి యుద్ధానికి పంపించిన వ్యక్తి. చుట్టుపట్ల నివసించే అరబ్బు తెగలను కూడా సైన్యంలో భర్తీ చేసుకున్నారు. స్వయంగా ఖురైష్ తెగల్లో కేవలం ఒక్క తెగ బనూ అద్దీ తప్ప అందరూ యుద్ధంలో పాల్గొన్నవారే. బనూ అద్దీకి చెందిన ఏ ఒక్కడు కూడా ఆ యుద్ధంలో పాల్గొనలేదు.

## మక్కా సైన్యబలం

ప్రారంభంలో వారి సంఖ్య పదమూడొందలు. వారి వెంట వంద గుర్రాలు, ఆరు వందల కవచాలు, లెక్కలేనన్ని ఒంటెలు ఉన్నాయి. సైన్యాధ్య

https://teluguislam.net



క్షుడు అబూ జహల్ బిన్ హష్షామ్. ఖురైష్‌కు చెందిన తొమ్మండుగురు గౌరవ నీయులు సైన్యానికి ఆహార సరఫరా బాధ్యతను తీసుకోవడం జరిగింది. ప్రతి రోజు తొమ్మిది లేక పది ఒంటెలు తెగేవి.

## బనూ బక్ర్ తెగల సమస్య

మక్కా సైన్యం బయలుదేరడానికి సిద్ధమైనప్పుడు వారికి, బనూ బక్ర్ తెగలతో వైషమ్యాలు ఉన్న విషయం గుర్తుకు వచ్చింది. అందుకని వెనుక నుండి ఈ తెగలు వారిపై దాడి చేస్తాయోమోనన్న భయం పట్టుకుంది. ఇలా వారు రెండు అగ్నిగుండాల నడుమ మాడిపోతామేమో అని బెంగపడనారంభించారు. సరిగ్గా అదే సమయంలో ఇబ్లీస్ (షైతాను), బనూ కనానా సర్దారు సురాకా బిన్ మాలిక్ బిన్ జఅషమ్ ముద్‌లజీ రూపంలో ప్రత్యక్షమై, "నేను మీకు మిత్రుణ్ణి, బనూ కనానా తెగ మీకు ఏ స్థితిలోనూ ఎలాంటి అఘాయిత్యానికి పాల్పడరని జామీను ఇస్తున్నాను" అని అన్నాడు.

## యుద్ధానికి బయలుదేరిన మక్కా సైన్యం

సురాకా బిన్ మాలిక్ రూపంలో ఉన్న ఇబ్లీస్ ఇచ్చిన ఈ హామీతో మక్కావాసులు బయలుదేరారు. విర్రవీగుతూ, ప్రజల ముందు తమ గొప్పతనాన్ని చాటుకుంటూ, దైవమార్గానికి అడ్డుపడుతూ, పదునైన ఆయుధాలతో, అల్లాహ్ మరియు ఆయన ప్రవక్త (స) అంటే మిడిసిపడుతూ, పగ తీర్చుకునే ఉద్దేశ్యంతో, పౌరుషం, ఆత్మాభిమానం ఉట్టిపడేటట్లు మదీనా వైపునకు బయలుదేరారు. వారి మదిలో ఉన్నదల్లా ఒక్కటే. దైవప్రవక్త ముహమ్మద్ (స) మరియు ఆయన అనుచరగణం మక్కా వర్తక బిడారాల వైపు కన్ను వేయడానికి ఎలా సాహసించారు? అన్నదే. ఎట్టకేలకు వీరు అతివేగంగా ఉత్తర దిశగా బద్ర్ వైపునకు వెడుతున్నారు. ఉస్ఫాన్ మరియు ఖుదైద్ లోయలను దాటి 'హుజ్ఫా' చేరుకున్న తరువాత అబూ సుఫ్యాన్ పంపిన వార్త అందింది వారికి. ఏ బిడారాన్నయితే, ఏ ధనాన్నయితే మీ మందీమార్బలంతో రక్షించడానికి బయలుదేరారో అల్లాహ్ దాన్ని రక్షించాడని, కాబట్టి వెనక్కు తిరిగి వచ్చేయమన్నదే ఆ వార్త సారాంశం.

https://teluguislam.net



## ప్రమాదాన్నుండి బయటపడిన వర్తక బిడారం

అబూ సుఫ్యాన్ ప్రమాదం నుండి ఎలా బయటపడ్డాడో ఆ వివరాలు ఇలా ఉన్నాయి: సిరియా నుండి బయలుదేరి అతను రహదారిపై ప్రయాణం సాగిస్తున్నాడే గాని ఎంతో మెలుకువతో వ్యవహరిస్తున్నాడు. సమాచారం రాబట్టే ప్రయత్నం చేస్తున్నాడు. బద్ర్ సమీపానికి వచ్చిన తరువాత తన బిడారాన్ని ఆపి ముందుకు వెళ్ళి మజ్దీ బిన్ అమ్రూను కలసి మదీనా సైనికదళం గురించి ఆరా తీశాడు. మజ్దీ మాత్రం తాను అసాధారణమైన విషయం ఏదీ కనుగొన లేదని చెబుతూ, ఇద్దరు ఉష్ట్రారోహుల్ని మాత్రం చూడడం తటస్థించిందని, ఫలానా మట్టి దిబ్బ దగ్గర ఆగారని, తమ తోలు సంచుల్లో నీరు నింపుకొని వెళ్ళారని చెప్పాడు. ఇది విన్న అబూ సుఫ్యాన్ పరుగున అక్కడికి వెళ్ళాడు. వారి ఒంటెల పెంటికల్ని తీసి త్రుంచిచూశాడు. అందు అతనికి ఖర్జూరపు గింజ ఒకటి అగుపడింది. ఇంకేముందీ? అతను బెదిరిపోతూ, దైవసాక్షి! ఇది యస్రిబ్‌కు సంబంధించిన మేత అంటూ అతి శీఘ్రంగా బిడారం వైపునకు పరుగుదీశాడు. దాన్ని పశ్చిమ దిశ వైపునకు మళ్ళించి సముద్ర తీరం వైపునకు నడిపించాడు. బద్ర్ నుండి వెళ్ళే బిడార మార్గాన్ని ఎడమ వైపున వదిలి ముందుకుసాగాడు. ఇలా తన బిడారాన్ని మదీనా సైన్యం చేతిలో పడకుండా కాపాడుకోగలిగాడు. వెంటనే తాను క్షేమంగా తప్పించుకున్న వార్తను మక్కా సైన్యానికి పంపడం జరిగింది. ఆ వార్త హుజ్ఫాలో ఉన్న ఆ సైన్యానికి అందింది.

## మక్కా సైన్యంలో ఏర్పడిన చీలిక - వెనక్కు మరిలే యత్నం

ఈ వార్త విన్న మక్కా సైన్యం వెనక్కు మరలడానికి సిద్ధపడింది. కాని ఖురైష్‌కు చెందిన ముష్కర నాయకుడు అబూ జహల్ లేచి, "దైవసాక్షి! మనం వెనక్కు మరలడానికి వీల్లేదు. బద్ర్ మైదానానికి వెళ్ళి అక్కడ మూడు రోజుల వరకు వేచి చూస్తూ ఒంటెలను జిబహ్ చేసి విందు ఆరగిద్దాం. సారాయి త్రాగుతూ నాట్యకత్తెల నాట్యాన్ని తిలకిద్దాం. అరేబియా మొత్తం మన ఈ ప్రయాణం గురించి వేనోళ్ళ పొగడాలి. ఇలా వారిపై మన ప్రభావం పడాలి" అని బీరాలు పలికాడు.

https://teluguislam.net



అయితే అబూ జహల్ చేసిన ప్రసంగానికి భిన్నంగా అఖ్నస్ బిన్ షురైఖ్ అనేవాడు, "లేదు! మనం వెనక్కు మళ్ళడంలోనే శ్రేయం ఉందని" సలహానిచ్చాడు. అయినా అతని మాటలు వారి చెవులకెక్కలేదు. అందుకని అతడు బనూ జహ్రా తెగను వెంటబెట్టుకొని వెనక్కి వెళ్ళిపోయాడు. అతను బనూ జహ్రా తెగకు మిత్రపక్షం వాడు. అంతేకాదు, బనూ జహ్రా సైన్యానికి సర్దారు కూడా. ఈ బనూ జహ్రా సైన్యం మొత్తం దాదాపు మూడొందల మంది. వీరిలో ఏ ఒక్కడూ బద్ర్ యుద్ధంలో పాల్గొనలేదు. ఆ తరువాత బనూ జహ్రా తెగవారు అఖ్నస్ బిన్ షురైఖ్ తీసుకున్న నిర్ణయానికి సంబరపడిపోయి అతణ్ణి ఎంతో గౌరవిస్తూ అతణ్ణి విధేయించనారంభించారు.

బనూ జహ్రాయే కాకుండా, బనూ హాషిమ్ తెగవారు కూడా వెనక్కు మళ్ళుదామని నిర్ణయించుకున్నారుగాని, అబూ జహల్ ఎంతో కఠినంగా ప్రవర్తిస్తూ, మేము వెనక్కు మళ్ళేంత వరకు ఈ వర్గం మమ్మల్ని వీడిపోడానికి వీల్లేదని పట్టుబట్టాడు.

మొత్తానికి మక్కా సైన్యం తన ప్రయాణాన్ని కొనసాగించింది. బనూ జహ్రా యోధులు తిరిగి వెళ్ళిపోయిన తరువాత ఇప్పుడు వారి సైనికుల సంఖ్య ఒక్క వెయ్యిగానే ఉండిపోయింది. వీరు బద్ర్ వైపునకు చొచ్చుకొని పోతున్నారు. బద్ర్ దాపుకు చేరి వారు ఓ చిన్న మట్టి దిబ్బ వెనుక ఆగిపోయారు. ఈ మట్టి తిన్నె బద్ర్ లోయ ప్రక్కన దాని దక్షిణ ముఖద్వారం వద్ద ఉంది.

## ఇస్లామీయ సైన్యానికి ఎదురైన సంక్లిష్ట పరిస్థితి

మహాప్రవక్త(స) అలా ప్రయాణిస్తూ మార్గం మధ్యలో ఉన్న జఫ్రాన్ లోయగుండా వెడుతున్నారోలేదో, మదీనా నుండి వర్తక బిడారం మరియు అటు మక్కా నుండి వస్తున్న సైన్యం గురించి వర్తమానం అందింది. ఈ వర్తమానాన్ని లోతుగా అధ్యయనం చేసిన తరువాత ఇక ఓ భీకర పోరాటం తప్పదనే నిర్ణయానికి వచ్చారాయన. ఇప్పుడు ధైర్యసాహసాలు, తెగింపును ప్రదర్శించవలసిన సమయం ఆసన్నమైందని తలిచారు. ఒకవేళ మక్కా సైన్యాన్ని తమ ప్రాంతంలో ఇష్టమొచ్చినట్లు సంచరించడానికి వీలు కల్పిస్తే ఖురైషుల ఆత్మబలం మరింత పెరిగిపోవచ్చు. వారి రాజకీయ పెత్తనం పరిధి మరింత విస్తరించవచ్చు. ముస్లిముల సందేశ ప్రచార పిలుపు మందగించి

https://teluguislam.net



బలహీనపడవచ్చు. ఆ తరువాత ఇస్లామీయ సందేశాన్ని ఎవరూ పట్టించుకోకుండా, ఇస్లామ్ అంటే గిట్టని ప్రతివాడూ ముస్లిములపై పెత్తనం చెలాయించే ప్రయత్నమూ చేయవచ్చు.

ఇదంతా ఒక ఎత్తయితే, మక్కా సైన్యం మదీనా వైపునకు పురోగమించదు అనే గ్యారంటీ ఏమిటి? ఈ సైనిక చర్యను మదీనా వరకు పొడిగించి, ముస్లిములను వారి ఇండ్లల్లో చొరబడి హతమార్చే ప్రయత్నం చేయదనే పూచీ ఏమిటి? అవును! ఒకవేళ మదీనా సైన్యం తరపున ఏ ఒక్క పొరపాటు జరిగినా ఇదంతా సాధ్యమే. అలా జరగకపోయినా సరే, ఇప్పటి వరకు మదీనా ముస్లిముల పేరు చెప్పగానే దిగులుపడిపోయే పరిస్థితికి, వారి ఖ్యాతికి దెబ్బతగలవచ్చును కూడా.

## సలహా సంఘ సమావేశం

పరిస్థితులు ఇలా హఠాత్తుగా మారిపోయినందున మహాప్రవక్త (స) ఓ ఉన్నత సైనిక సలహా సంఘాన్ని సమావేశపరిచారు.ఈ సమావేశంలో ఎదురైన పరిస్థితిని గురించి వివరించి వారి సలహాలను అడిగారు. ఈ సందర్భంలో ముస్లిముల్లోని ఓ వర్గం భీకర యుద్ధం మాట వినగానే కంపించిపోయింది. వారి గుండెలు గడగడలాడాయి. వారి ఈ పరిస్థితినే వివరిస్తూ దివ్యగ్రంథం ఇలా అంటోంది:

كَمَآ اَخْرَجَكَ رَبُّكَ مِنْۢ بَيْتِكَ بِالْحَقِّ ۖ وَاِنَّ فَرِيْقًا مِّنَ الْمُؤْمِنِيْنَ لَكٰرِهُوْنَ ۙ يُجَادِلُوْنَكَ فِى الْحَقِّ بَعْدَمَا تَبَيَّنَ كَاَنَّمَا يُسَاقُوْنَ اِلَى الْمَوْتِ وَهُمْ يَنْظُرُوْنَ ۞

"నీ ప్రభువు నిన్ను సత్యంతో నీ గృహం నుండి బయటకు తీసుకు వచ్చాడు. విశ్వసించిన వారిలో ఒక వర్గం వారికి ఇది ఇష్టంగా లేదు. వారు ఈ సత్యం విషయంలో నీతో ఘర్షణ పడ్డారు. అది వాస్తవానికి, సత్యం పూర్తిగా రుజువైపోయింది. వారి పరిస్థితి తమ కళ్ళ ముందే తాము మృత్యువు వైపునకు తరుమబడే వారి మాదిరిగా ఉంది." (8 : 5-6)

కాని సైన్యాధ్యక్షుల విషయానికి వస్తే, వీరిలో హజ్రత్ అబూ బక్ర్ (ర)

https://teluguislam.net



లేచి నిలబడి ఎంతో సమంజసమైన మాటలు పలికారు. ఆ తరువాత హజ్రత్ ఉమర్ (ర) లేచారు, ఆయన కూడా మేలైన పలుకులే పలికారు. ఆ తరువాత హజ్రత్ మిగ్దాద్ బిన్ అమ్రూ (ర) లేచి, "ఓ దైవప్రవక్తా (స)! అల్లాహ్ తమకు ఏ మార్గమైతే చూపించాడో, ఆ మార్గం పైన్నే మీరు నడవాలి. మేము మీ వెంటే ఉంటాము. దైవసాక్షి! మేము, హజ్రత్ మూసా ప్రవక్త (అ.స.)తో బనీ ఇస్రాయీల్ ప్రజలు, "ఓ మూసా! నీవూ, నీ ప్రభువు ఉభయులూ పోయి పోరాడండి. మేము ఇక్కడే కూర్చొని ఉంటాము" అని పలికినట్లు పలకము. మేము చెప్పేదల్లా, మీరూ, మీ ప్రభున్నూ ఉభయులూ వెళ్ళి పోరాడండి. మేము కూడా మీ వెంటే ఉండి పోరాడుతాం. తమరిని(స) సత్యంతో ప్రభవింపజేసిన ఆ అల్లాహ్ సాక్షి! ఒకవేళ మీరు మమ్మల్ని 'బర్కె గిమాద్' వరకు తీసుకువెళ్ళినా, మేము దారంతా పోరాడుతూనే మీ వెంట అక్కడికి వెళ్ళడానికి కూడా సిద్ధమే."

వారి మాటలను విన్న దైవప్రవక్త(స) వారిని దీవించడం, వారి కొరకు దుఆ చేయడం జరిగింది.

ఈ ముగ్గురు కమాండర్లూ ముహాజిర్లే. వీరి సంఖ్య ఆ సైన్యంలో తక్కువ. దైవప్రవక్త (స), అన్సార్ల సలహా కూడా తెలుసుకోదలిచారు. ఎందు కంటే వారి సంఖ్య అధికం. యుద్ధం అసలు భారం వారి భుజస్కంధాలపైన్నే పడనుంది. 'బైతె అక్బా' ప్రకారం వారు మదీనా నుండి బయటకు వచ్చి యుద్ధం చేయాలని లేదు. అందుకని ఆయన ఆ ముగ్గురు సర్దారుల మాటలు విన్న తరువాత, "ప్రజలారా! మీరు కూడా నాకు సలహా ఎందుకివ్వరూ?" అని అడిగారు. అంటే, అన్సారుల నోట కూడా ఏదైనా వినదలచుకున్నారాయన. ఈ విషయాన్ని అన్సారులకు చెందిన కమాండరు, ధ్వజవాహకుడు అయిన హజ్రత్ సఅద్ బిన్ ముఆజ్ గుర్తించి దైవప్రవక్త (స)తో, "దైవసాక్షి! ఓ దైవప్రవక్తా! బహుశా తమరు మా సలహా ఏమిటో తెలుసుకోదలచుకుంటున్నారా?" అని అడగగా, "అవును" అని బదులిచ్చారాయన.

"అయితే వినండి! మేమైతే మిమ్మల్ని విశ్వసించాము. మిమ్మల్ని ధృవపరిచాము. మీరు తెచ్చినదంతా సత్యమని సాక్ష్యం ఇచ్చాము. దానిపై మిమ్మల్ని విధేయిస్తామని, మీ మాటలను జవదాటమని ప్రమాణం కూడా చేశాము. కాబట్టి ఓ మహాప్రవక్త(స)! మీరు అనుకున్న దాని ప్రకారమే

https://teluguislam.net



కానివ్వండి, మిమ్మల్ని సత్యంతో ప్రభవింపజేసిన ఆ అల్లాహ్ సాక్షిగా చెబుతున్నాను! మీరే గనక మమ్మల్ని తీసుకుని సముద్రంలో దూకదలచు కుంటే దూకేయండి. మాకు చెందిన ఒక్క మనిషి కూడా వెనక్కు అడుగు వేయడు. రేపు మా శత్రువులతో ఢీకొనదలిస్తే దానికి మేము వెనకంజవేసే వారము గాము. మేము యుద్ధవీరులం, రణశూరులం. బహుశా అల్లాహ్ మీకు మా యుద్ధకౌశలం ఏమిటో చూపించదలిచాడేమో. అప్పుడు చూద్దురు గాని మా ప్రతాపం. మీ కళ్ళు చల్లబడగలవు. అల్లాహ్ శుభం కలిగించుగాక'' అని తమ నిర్ణయాన్ని దైవప్రవక్త(స)కు ఎరుకపరిచారు.

మరో ఉల్లేఖనంలో ఇలా ఉంది:

హజ్రత్ సఅద్ బిన్ ముఆజ్ (ర), దైవప్రవక్త (స)తో ఇలా విన్నవించుకున్నారు: "బహుశా మీకు, అన్సారులు మదీనాలో మాత్రమే సహాయపడతారేమోననే శంక ఉండి ఉంటుంది. అందుకని నేను అన్సారుల తరపున చెబుతున్నాను. తమరు మమ్మల్ని ఎక్కడికి తీసుకువెళ్ళినా, మరెవ్వరితో సంబంధాలు పెట్టుకున్నా, మేము మాత్రం మీతోనే ఉంటాం. మా ధన సంపద నుండి తమరు ఏది తీసుకున్నా, ఇంకొకరికి ఏది ఇచ్చినా అది మాకు ఇష్టమైన కార్యమే అవుతుంది. ఈ వ్యవహారంలో మీ తీర్పే మాకు శిరోధార్యం. మేము దాన్ని విధేయిస్తాము. దైవసాక్షి! మీరు ముందుకు అడుగేస్తూ 'బర్కె గిమాద్' వరకు వెళ్ళినా మేము మీ వెంటే ఉంటాం. ఒకవేళ మీరు మమ్మల్ని తీసుకొని సముద్రంలో దూకదలచుకున్నా మీ వెంట సముద్రంలో దూకడానికి సిద్ధంగా ఉన్నాం."

హజ్రత్ సఅద్ (ర) గారి ఈ మాటలు విన్న దైవప్రవక్త (స) గారి ముఖారవిందం ఆనందంతో వికసించింది.

"ఇక పదండి. సంతోషంగా ముందుకు అడుగేయండి. అల్లాహ్ నాకు రెండు వర్గాల్లో నుండి ఒక వర్గం గురించి వాగ్దానం చేశాడు. అల్లాహ్ సాక్షి! ఇప్పుడు నాకు జాతి వధ్యస్థలాలు అగుపడుతున్నాయి" అని సెలవిచ్చారు మహాప్రవక్త (స).

## ఇస్లామీయ సైనికదళం సాగించిన మిగతా ప్రయాణం

ఆ తరువాత దైవప్రవక్త(స) 'జఫ్రాన్' దాటి అసాఫరుగా ప్రఖ్యాతిగాంచిన కొన్ని కొండ మలుపులు తిరిగి 'వీత్' పేరుగల గ్రామ ప్రాంతానికి చేరారు.

https://teluguislam.net



అక్కడి నుండి 'హన్నాన్' పేరుగల ఎత్తయిన దిబ్బను కుడి ప్రక్కగా వదులుతూ 'బద్ర్' చేరారు.

## శత్రువు ఆచూకీ తెలుసుకునే ప్రథమ ప్రయత్నం

ఈ ప్రదేశానికి చేరిన మహాప్రవక్త(స), సౌర్ గుహ సహచరి అయిన తన మిత్రుడు అబూ బక్ర్ (ర)ను వెంట తీసుకొని శత్రువు ఆచూకీ తెలుసుకోడానికి స్వయంగా బయలుదేరారు. దూరంగా ఉండి మక్కా సైనిక దళ క్యాంపును పరిశీలించేటప్పుడు ఓ ముసలి అరబ్బు వారికి తారసపడ్డాడు. దైవప్రవక్త (స) అతన్ని ఖురైష్ మరియు ముహమ్మద్ మరియు ఆయన(స) అనుచరుల వివరాలేమిటో చెప్పమని అడిగారు - రెండు దళాలను గురించి అడగడంలోని ఔచిత్యం ఏమిటంటే, దైవప్రవక్త (స) వ్యక్తిత్వం ఆ ముసలి అరబ్బుకు తెలియకుండా ఉండాలన్నదే - కాని ఆ ముసలివాడు, "మీరు ఏ జాతికి చెందిన వారో తెలిపితేనే చెబుతానన్నాడు." "అలా కాదు నీవేముందు ఎవరివో చెబితే నేను చెబుతాను" అన్నారు దైవప్రవక్త(స).

"ఓహో! ఇది బదులుకు బదులా!" అన్నాడు ముసలివాడు.

"ఔను."

"నాకు తెలిసినంత మట్టుకు ముహమ్మద్ (స) మరియు ఆయన అనుచరులు ఫలానా రోజున బయలుదేరారు. చెప్పేవాడు గనక ఆ విషయం సరిగ్గా చెప్పి ఉంటే ఇప్పుడు ముహమ్మద్ (స) ఫలానా చోట ఉండి ఉంటారు"- అని ప్రస్తుతం మదీనా సైన్యం ఉన్నచోటు గురించి చెప్పాడు - అలాగే ఖురైషులు కూడా ఫలానా రోజున బయలుదేరారు. అదే ఖచ్చితమైన సమాచారం అయితే వారు ఫలానా చోట విడిది చేసి ఉంటారు"- అని ప్రస్తుతం మక్కా సైన్యం ఉన్న చోటునే చూయించాడతడు.

ముసలివాడు తన మాటను పూర్తిచేసి, "మీరెవరో చెప్పారు కాదు?"అని అడిగాడు.

దానికి దైవప్రవక్త (స), "మేము ఒకే నీటికి సంబంధించిన వారమని" వెనక్కు మళ్ళిపోయారు.

"ఒకే నీళ్ళా? అంటే ఇరాక్ నీళ్ళా?"అని గొణుక్కుంటూ వెళ్ళిపోయాడు ఆ వృద్ధుడు.

https://teluguislam.net



## మక్కా సైన్యం గురించి అందిన ముఖ్యవార్తలు

ఆ రోజు సాయంత్రమే ప్రవక్తశ్రీ(స), శత్రుజాడను తెలుసుకోడానికి ఓ క్రొత్త వేగుల బృందాన్ని పంపించడం జరిగింది. ఈ కార్యం నెరవేర్చుకు రావడానికి ఈ బృంద సభ్యులుగా ముహాజిర్లయిన హజ్రత్ అలి(ర), జుబైర్ బిన్ అవామ్ (ర) మరియు సఅద్ బిన్ అబీ విఖాస్(ర)లు వెళ్ళారు. వీరు నేరుగా బద్ర్ నీటి చెలమ వద్దకు వెళ్ళగా అక్కడ ఇద్దరు బానిసలు మక్కా సైన్యం కోసం నీరు నింపడం చూశారు. వెంటనే వారిద్దరిని బంధించి దైవ ప్రవక్త(స) సన్నిధికి తీసుకువచ్చారు. అప్పుడు ప్రవక్తశ్రీ(స) నమాజు చేస్తున్నారు. సహాబా(ర) ఆ ఇద్దరు బానిసలను ప్రశ్నించనారంభించారు. వారు, తాము ఖురైషులకు నీరు త్రాగించే బానిసలమని, మమ్మల్ని నీళ్ళ కోసం వారు పంపించారనీ చెప్పారు. ఈ సమాధానం వీరికి రుచించనందున చితకబాదారు. వీరిద్దరు అబూ సుఫ్యాన్ మనుషులనుకుంటున్నారు వీరు - ఎందుకంటే, ఇంకా ఆ వర్తక బిడారాన్ని సొంతం చేసుకోవాలనే ఆశ వారిలో ఉంది కాబట్టి- సహాబా (ర) వారిని కొట్టి విషయం రాబట్టుకోవాలని చూస్తున్నారు. ఆ దెబ్బలకు తాళలేక మేము అబూ సుఫ్యాన్ మనుషులమే అని అనగానే కొట్టడం ఆపేసేవారు.

దైవప్రవక్త (స) నమాజు పూర్తి చేసుకొని కొంత కోపంగా, "వీరిద్దరు నిజం పలుకుతూ ఉంటే మీరు వారిని బాదుతున్నారు, అబద్ధమాడితే వదిలేశారు. దైవసాక్షి! వీరిద్దరు చెప్పేదే సరైనది. వీరు ఖురైష్‌ల మనుషులు" అన్నారు.

ఆ తరువాత ఆయన (స) ఆ ఇద్దరు బానిసలతో, "సరే, మీరిప్పుడు ఖురైషులను గురించి చెప్పండి" అని అడిగారు.

"ఈ లోయ ముఖ ద్వారం చివర ఉన్న ఆ మట్టి దిబ్బ వెనుకే ఖురైషు సైన్యం విడిది చేసి ఉంది."

"ఎంత మంది వరకు ఉంటారా సైన్యంలో?" ప్రశ్న.

"ఓ! చాలా మంది ఉన్నారు."

"వారి సంఖ్య ఎంతై ఉంటుంది?"

"మాకు తెలియదు."

https://teluguislam.net



"సరే, రోజు ఎన్ని ఒంటెలు తెగుతున్నాయి?"

"ఓ రోజు తొమ్మిది, మరో రోజు పది వరకు తెగుతున్నాయి."

"ఓహో, అయితే వారి సంఖ్య తొమ్మిది మరియు పది వందలకు మధ్యన ఉంటుంది."

"వారిలో ఖురైషులకు చెందిన సర్దారులు, ధనవంతులెవరెవరున్నారు?" అని అడిగారు దైవప్రవక్త(స).

"రబీయా ఇద్దరు కుమారులు ఉత్బా మరియు షైబా, అబుల్ బక్తరీ బిన్ హష్షామ్, హకీమ్ బిన్ హిజామ్, నౌఫిల్ బిన్ ఖువైలిద్, హారిస్ బిన్ ఆమిర్, తఅయిమా బిన్ అద్దీ, నజ్ర్ బిన్ హారిస్, జమ్అ బిన్ అస్వద్, అబూ జహల్ బిన్ హష్షామ్, ఉమయ్యా బిన్ ఖల్ఫ్" అంటూ మరికొందరి పేర్లు చెప్పారు ఆ బానిసలు.

మహాప్రవక్త(స) సహాబా(ర) వైపు తిరిగి, "చూశారా! మక్కా తన హృదయ శకలాలను (గౌరవనీయులైన సర్దారులను) మీ ముందుకు తెచ్చి పడేసింది" అని అన్నారు.

## దైవకారుణ్యం కురిసిన వేళ

అల్లాహ్ ఆ రాత్రే వర్షాన్ని కురిపించాడు. ఆ వర్షం ముష్రిక్కుల వైపు కుంభవృష్టిగాను, ముస్లిములు ఉన్న వైపు పూలజల్లుగాను కురిసింది. దీని కారణంగా శత్రువులు బురద కారణంగా ముందుకు రాలేకపోయారు. కాని ముస్లిములపై కురిసిన జల్లు వారిని పునీతులుగా చేసింది. షైతాన్ ఎత్తుగడలు మట్టిలో కలసిపోయాయి. నేల చదునై ఇసుక గట్టి పడింది. అడుగులు ఇసుకలో దిగబడకుండా నడవడానికి సులువుగా మారింది నేలంతా. అలా ముస్లిముల స్థితి మెరుగై వారికి మనోబలం చేకూరింది.

## ఖురైషు సైనిక కేంద్రాల వైపునకు కదిలిన ముస్లిములు

ముష్రిక్కులకంటే ముందే బద్ర్ నీటి చెలమ వద్దకు చేరాలని, వారు దాన్ని హస్తగతం చేసుకోకుండా చేయడానికి మహాప్రవక్త (స) తమ సేనలను ముందుకు కదిలించారు. అలా ఆయన 'ఇషా' సమయం అయ్యేటప్పటికల్లా చెలమల్లోని ఓ సమీప చెలమకు చేరిపోయారు. ఈ సందర్భంగా హజ్రత్

https://teluguislam.net



'హబ్బాబ్ (ర) బిన్ మున్జిర్' ఓ అనుభవజ్ఞుడైన సైన్యాధ్యక్షునిగా దైవప్రవక్త (స)నుద్దేశించి, "దైవప్రవక్తా(స)! తమరు ఈ ప్రదేశం వద్దకు అల్లాహ్ ఆదేశం మేరకు వచ్చారా? లేదా యుద్ధనీతి ప్రకారమా? ఇక్కడి నుండి మనం వెనక్కు గానీ ముందుకుగానీ వెళ్ళే అవకాశం ఉండదు మరి" అని అడిగారు. దానికి ప్రవక్తశ్రీ,"లేదు, మనం ఇక్కడకు వచ్చింది యుద్ధనీతిని అనుస రించే"అని అన్నారు.

"ఇది సరియైన స్థలం కాదు. తమరు ఇంకా ముందుకు వెళ్ళాలి. ఖురైషులకు దాపులో ఉన్న చెలమ దగ్గరకు వెళ్ళి ఆగాలి, ఆ తరువాత మనం తక్కిన చెలమలన్నింటిని పూడ్చేద్దాం. మన చెలమ దగ్గర ఓ తొట్టి కట్టి అందులో నీరు నిలువ ఉంచుకోవాలి. ఆ తరువాత మనం ఖురైషులతో యుద్ధం ప్రారంభించినప్పుడు మనకు త్రాగడానికి నీరు లభిస్తుంది. వారికి మాత్రం నీరు కరువైపోతుంది" అని సలహానిచ్చారు హజ్రత్ హబ్బాబ్(ర).

"నీవు సరైన సలహానే ఇచ్చావు" అని తమ సైన్యాన్ని వెంటబెట్టుకొని రాత్రి నడిఝాముకు శత్రు శిబిరం దాపులోని ఓ చెలమ దగ్గరకు చేరిపోయారు. అక్కడ సహాబా(ర) ఓ హౌజు కట్టి తక్కిన చెలమలన్నింటినీ పూడ్చేశారు.


## యుద్ధ పర్యవేక్షణా కేంద్రం

సహాబా(ర) చెలమ దగ్గర విడిది చేయగానే, హజ్రత్ సఅద్ బిన్ ముఆజ్ (ర) మదిలో మరో ఆలోచన వచ్చింది. యుద్ధాన్ని పర్యవేక్షిస్తూ, సైన్యానికి ఆదేశాలు జారీ చేయడానికిగాను మహాప్రవక్త (స) కోసం ఓ ప్రత్యేక స్థలాన్ని ఎందుకు ఎంచుకోకూడదు? ఒకవేళ విజయానికి బదులు అపజయం ఎదురైన పక్షంలో, ఆ అనివార్య పరిస్థితిని ఎదుర్కోవడానికి మనం ఎందుకు సంసిద్ధులై ఉండకూడదు? అనేదే ఆ ఆలోచన. దీన్ని అమలు చేయడానికిగాను ఆయన మహాప్రవక్త (స) వద్దకు వచ్చి;

"ఓ దైవప్రవక్తా (స)! మేము తమ కోసం ఓ పందిరిని ఎందుకు వేయకూడదు? అందులో విశ్రాంతి తీసుకుంటూ యుద్ధాన్ని పర్యవేక్షించవచ్చు కదా? తమ దగ్గర వాహనాలను సైతం ఉంచుతాం. ఆ తరువాత మేము మా శత్రువుతో ఢీ కొంటాం. అల్లాహ్ మనకే గౌరవం ప్రాప్తం చేసి శత్రువుపై ఆధిక్యతను కలిగిస్తే సరేసరి. కాని దానికి భిన్నమైన పరిస్థితి ఎదురైతే తమరు

https://teluguislam.net





https://teluguislam.net



ఆ వాహనానెక్కి మదీనా వెళ్ళిపోవచ్చు. మాతో ఇక్కడికి రాలేకపోయిన వారు మదీనాలో ఉన్నారు. దైవప్రవక్తా (స)! నిజంగా వారు మిమ్మల్ని ప్రేమించే విషయంలో మాకంటే మేలైనవారు. యుద్ధం అనివార్యమైపోయిందని వారికి తెలిసి ఉంటే మాత్రం వారు ఎన్నటికీ అక్కడ ఆగిపోయి ఉండేవారు కాదు. అల్లాహ్ మిమ్మల్ని వారి ద్వారా రక్షించగలడు. వారు మీ మేలు కోరేవారు. మీ వెంట జిహాద్‌లో పాల్గొనేందుకు సిద్ధంగా ఉంటారు" అని అన్నారు.

ఇది విన్న మహాప్రవక్త(స) ఆయన్ను మెచ్చుకొని దీవించారు. ముస్లిములు యుద్ధమైదానం ఈశాన్య దిశగా ఓ ఎత్తయిన మట్టి తిన్నెపై ఆయన కోసం ఓ పందిరి వేశారు. అక్కడి నుండి యుద్ధ మైదానం పూర్తిగా అగుపడుతుంది. ఆ తరువాత దైవప్రవక్త(స), హజ్రత్ సఅద్ బిన్ ముఆజ్(ర) గారి నేతృత్వంలో అన్సారులకు సంబంధించిన ఓ సైనిక పటాలాన్ని ఎంపిక చేశారు.

## సైన్యాన్ని క్రమబద్ధం చేసి రేయి గడపడం

తదుపరి దైవప్రవక్త (స) సైన్యాన్ని క్రమబద్ధీకరించారు[1]. యుద్ధమైదానానికి అరుదెంచి, తన చేతితో చూయిస్తూ, రేపు ఫలానా వ్యక్తి ఇక్కడ మరియు ఫలానా వ్యక్తి అక్కడ హతుడవుతాడు ఇన్షా అల్లాహ్, ఇది ఫలానా వ్యక్తి వధ్యస్థలం, అది ఫలానా వ్యక్తి వధ్యస్థలం ఇన్షా అల్లాహ్[2] అని చెబుతూ పోయారు.

అక్కడే ఓ చెట్టు బోదె దగ్గర కూర్చుని రాత్రి గడిపారు. ముస్లిముల హృదయాలు విశ్వాసంతో నిండిపోయి ఉన్నాయి. వారంతా ఉజ్వలమైన ఉదయం కోసం ఎదురు చూస్తూ గడిపారు. వారికి తెల్లారగానే తమ కళ్ళతో దైవం అవతరింపజేయబోయే శుభాలను చూస్తామనే నమ్మకం ఏర్పడింది. ఈ పరిస్థితిని దివ్యగ్రంథం ఖుర్‌ఆన్ ఇలా వివరిస్తోంది:

إِذْ يُغَشِّيكُمُ النُّعَاسَ أَمَنَةً مِّنْهُ وَيُنَزِّلُ عَلَيْكُم مِّنَ السَّمَاءِ مَاءً لِّيُطَهِّرَكُم بِهِ وَيُذْهِبَ عَنكُمْ رِجْزَ الشَّيْطَانِ وَلِيَرْبِطَ عَلَىٰ قُلُوبِكُمْ وَيُثَبِّتَ بِهِ الْأَقْدَامَ ﴿١١﴾

---

1. చూడండి, జామియ తిర్మిజీ, జిహాద్ అధ్యాయం-1/201.
2. ముస్లిమ్, హజ్రత్ అనస్(ర) గారి ఉల్లేఖనం, మిష్కాత్-2/543.

https://teluguislam.net



"ఇంకా, ఆ సమయాన్ని (కూడా జ్ఞాపకం ఉంచుకోండి) అప్పుడు అల్లాహ్ తన తరపు నుండి నిద్రమత్తు రూపంలో నిశ్చింతనూ, నిర్భయ స్థితినీ మీపై ఆవహింపజేస్తూ ఉన్నాడు. ఆయన ఆకాశం నుండి వర్షాన్ని మీపై వర్షింపజేస్తూ ఉన్నాడు. మిమ్మల్ని పరిశుద్ధపరచాలని, మీకు షైతాను వల్ల కలిగిన మాలిన్యాన్ని మీ నుండి దూరం చేయాలని, మీకు ధైర్యం కలిగించా లని, తద్వారా మీ పాదాలను సుస్థిరం చేయాలని." (8 : 11)

ఈ రాత్రి శుక్రవారం, హిజ్రీ శకం 2 రమజాన్ నెలకు చెందిన రాత్రి. దైవప్రవక్త (స) ఈ నెల 8 లేదా 12వ తారీఖున మదీనా నుండి బయలుదేరారు.

## యుద్ధరంగానికి మక్కా సైన్యం రాక - వారిలో పొడసూపిన పరస్పర మనస్పర్థలు

మరో వంక ఖురైషులు, లోయ ముఖద్వారం బయట తమ శిబిరంలో రేయి గడిపారు. ఉదయాన్నే తమ సైనిక పటాలాలతో మట్టి దిబ్బను దిగి బద్ర్ వైపునకు బయలుదేరారు. ఓ వర్గం దైవప్రవక్త (స) గారు నిర్మించిన నీటి హౌజు వైపునకు కదిలింది. వారిని వదిలేయండని మహాప్రవక్త (స) ఆదేశించారు. కాని ఆ హౌజు నుండి నీరు త్రాగిన ప్రతివాడూ ఈ యుద్ధంలో చంపబడ్డాడు ఒక్క హకీమ్ బిన్ హిజామ్ తప్ప. అతను ఆ తరువాత ఇస్లామ్ ధర్మాన్ని స్వీకరించి ఓ ఉత్తముడైన ముస్లిమ్‌గా మారిపోయాడు. అతను ఎప్పుడైనా ఒట్టు వేసుకుంటే ఆ సంఘటనను గుర్తు చేసుకొని, "నన్ను బద్ర్ యుద్ధం నుండి విముక్తునిగా చేసిన ఆ దైవం సాక్షి!" అని ఒట్టు వేసుకునేవాడు.

మొత్తానికి ఖురైషులు అంతా స్థిమితపడ్డాక, మదీనా సైన్యం ఎంత ఉందో తెలుసుకోవడానికి 'ఉమైర్ బిన్ వహబ్ జమ్‌హీ'ని పంపించారు, ఉమైర్ గుర్రమెక్కి మదీనా సైన్యం చుట్టూ తిరిగి వచ్చాడు. తిరిగి వచ్చి, "ఇంచుమించు మూడొందల మందిదాకా ఉంటారు. కాని కొంచెం ఆగండి! వారికి ఎలాంటి సహాయం అయినా అందుతోందా లేదా, మరెక్కడైనా దాక్కొని ఉన్నారా చూసి వస్తాను" అని చెప్పి తిరిగి తన గుర్రాన్ని దౌడు తీయించాడు, చాలా దూరం వరకు వెళ్ళినా అతనికి ఏదీ కనిపించలేదు. తిరిగి వచ్చి ఖురైషులతో, "నాకు ఏమీ కనిపించలేదు. అయితే ఓ ఖురైష్ ప్రజలారా! నేను చావును మోసుకొని వచ్చిన పరిస్థితులను చూశాను. యస్రిబ్ ఒంటెలు వాటిపై స్వచ్ఛమైన

మరణాలను మోసుకువచ్చాయి. వచ్చినవారి రక్షణ, మనుగడ స్వయంగా వారి కరవాలాలే తప్ప మరేవీ కావు. దైవసాక్షి! నేను తలుస్తున్నట్లు వారి ఏ మనిషి అయినా మీ మనిషిని చంపనిదే చావడు. వారు మీ ప్రముఖులను ఏరికోరి చంపేస్తే, వారు మరణించాక జీవించి ఉండడం దండగ. అందుకని కాస్త నింపాదిగా ఆలోచించుకోండి" అని అన్నాడు.

ఈ సమయంలో అబూ జహల్‌కు వ్యతిరేకంగా - కక్ష కట్టినవారు- ఓ క్రొత్త జగడాన్ని లేవదీశారు. ఈ వర్గం లేవనెత్తిన డిమాండు ప్రకారం, యుద్ధం చేయకుండానే మక్కాకు తిరిగిపోవాలి, అందుకని హకీమ్ బిన్ హిజామ్‌కు మంచి అవకాశం లభించింది. అతను ఉత్బా బిన్ రబీయా దగ్గరకు వెళ్ళి ఇలా అన్నాడు:

"అబుల్ వలీద్! మీరు ఖురైషులకు చెందిన గౌరవనీయులైన పెద్ద మనిషి. ఆదేశ పాలనకు మీరు అర్హులైన సర్దారు కూడా. భవిష్యత్తులో మీరు ఓ సత్కార్యం చేసిన వ్యక్తిగా ఎందుకు గుర్తించబడకూడదు?"

"ఉత్బా! ఆ పని ఎలాంటిది? నన్నేం చేయమంటారు?"

"మీరు మీ వారిని వెనక్కు తీసుకొని వెళ్ళండి. మీ మిత్రపక్షానికి చెందిన అమ్రూ బిన్ హజ్రమీ వ్యవహారం -(నఖ్లా సరియ్యాలో చంపబడిన వాడు) మీ నెత్తిన వేసుకోండి."

"సరే, అది నాకు సమ్మతమే. నా వైపు నుండి పూచీ తీసుకోండి. అతను నా మిత్రపక్షంలోని వాడు. అతని రక్తపరిహారం కూడా నేనే భరిస్తాను. ఆ సరియ్యాలో వారు పోగొట్టుకున్న ధనానికి బాధ్యత కూడా నాదే" అని చెబుతూ ఉత్బా, "మీరు హన్జలియా కుమారుని దగ్గరకు వెళ్ళండి (హన్జలియా అబూ జహల్ తల్లి గనుక అతణ్ణి ఈ విధంగా సంబోధించడం జరిగింది). అతను వ్యవహారాలను చెడగొట్టడంలో, ప్రజలను ఉసిగొల్పడంలో మహా దిట్ట. అందుకని అతని నుండే నాకు శంక ఉంది" అని అన్నాడు.

ఆ తరువాత ఉత్బా బిన్ రబీయా నిలబడి ఉపన్యసిస్తూ, "ఖురైష్ ప్రజలారా! మీరు ముహమ్మద్(స) మరియు ఆయన(స) సహచరులతో యుద్ధం చేసి ఎలాంటి ఘనకార్యాన్నీ నిర్వహించలేరు. దైవసాక్షి! మీరే గనక వారిని చంపేస్తే మీకు ఎదురుపడే ముఖాలను మీరు చూడడానికైనా సిద్ధ పడరు. ఎందుకంటే, మనిషి తన పినతండ్రి కుమారులనుగాని, పిన్నమ్మ

https://teluguislam.net



కుమారులనుగాని, తమకే చెందిన కుటుంబ సభ్యునిగాని చంపితే అది గొప్పతనమవుతుందా? అందుకని వెనక్కు వెడదాం పదండి. ముహమ్మద్(స) మరియు అరేబియా జోలికే పోకండి. అరబ్బులే గనుక వారిని చంపితే మీరు అనుకున్నది నెరవేరినట్లే. అలా జరగకపోతే ముహమ్మద్(స)తో ప్రవర్తించ వలసిన తీరుగా ప్రవర్తించనందుకు దోషులైపోగలరు."

ఇటు హకీమ్ బిన్ హిజామ్, అబూ జహల్ దగ్గరకు వెళ్ళినప్పుడు అతను తన కవచాన్ని సరిచేసుకుంటున్నాడు. అతణ్ణి చూసి హకీమ్ ఇలా అన్నాడు:

"ఓ అబుల్ హకమ్! ఉత్బా నన్ను మీ దగ్గరికి ఈ సందేశాన్నిచ్చి పంపించాడని" విషయం అంతా విశదీకరించాడు. అది విన్న అబూ జహల్ అరికాలి మంట నెత్తికెక్కింది.

"దైవసాక్షి! ముహమ్మద్ మరియు అతని సహచరుల్ని చూసి ఉత్బా గుండెలు అవిశిపోయాయి. లేదు, అలా జరగడానికి వీల్లేదు. దైవసాక్షి! మేము వెనక్కు మళ్ళేదే లేదు. అల్లాహ్ మనకూ ముహమ్మద్ (స)కూ నడుమ ఏదైనా తీర్పునిస్తే తప్ప. ఉత్బా అలా ప్రేలడానికి గల కారణం అతను ముహమ్మద్‌ను, అతని సహచరుల్ని ఒంటె భక్షకులుగా తలచడమే. ఉత్బా కుమారుడు కూడా ముహమ్మద్ సైన్యంలో ఉన్నందుకే అతను మిమ్మల్ని బెదరగొడుతున్నాడు(ఉత్బా కుమారుడు అబూ హజీఫా ప్రప్రథమంగా ఇస్లామ్‌ను స్వీకరించినవారిలో ఉన్నారు. మదీనాకు హిజ్రత్ చేసి వచ్చినవారు).

ఉత్బాకు అబూ జహల్ చెప్పిన మాటల్లో, "దైవసాక్షి! ఉత్బా గుండెలు అదిరిపోయాయి" వినగానే అతను, "ఓహో ఆ పిరుదల నుండి పాదాలు తీసిన వానికి (లేదా పిరుదలపై అత్తరు పూసుకున్నవానికి)- ఇది అరబిక్ సామెత అంటే అమాయకుడు, పిచ్చివాడు అని అర్థం - త్వరలోనే తెలుస్తుంది. ఎవరి గుండెలు అవిశిపోతున్నాయో?" అని చిందులేశాడు.

అబూ జహల్‌కు, ఈ సంక్షోభం ముదిరిపోతుందనే భయం పట్టుకుంది. వెంటనే ఆమిర్ బిన్ హజ్రమిని - ఇతను సరియ్యా బిన్ హజష్‌లో మరణించిన అమ్రూ బిన్ హజ్రమి సోదరుడు - పిలిపించి, "మీ మిత్రపక్షం అయిన ఉత్బా మిమ్మల్ని వెనక్కు తీసుకొనిపోడానికి చూస్తున్నాడు. మేము మీ ప్రతీకారాన్ని ఎలా తీర్చుకోజూస్తున్నామో మీకు తెలుసు. కాబట్టి లేచి

https://teluguislam.net



నిలబడండి. మీ సోదరుని మరణాన్ని గుర్తు చేసుకోండి" అని అన్నాడు. ఇది విన్న ఆమిర్‌కు పౌరుషం ముంచుకొచ్చింది. కట్టుకున్న వస్త్రాన్ని విప్పేసి నగ్నంగా నిలబడి, "అయ్యో అమ్రూ! అయ్యో అమ్రూ!" అంటూ అరిచాడు. దీనికి అతని తెగ వారు మరింత రెచ్చిపోయారు. వారి వైఖరి మరింత కఠినంగా మారిపోయింది. యుద్ధం చేసే కోరిక మరింత హెచ్చింది. ఉత్బా చేసిన ప్రయత్నం అంతా బూడిదలో బోసిన పన్నీరు చందంగా మారిపోయింది. ఈ ప్రయత్నం విఫలం అయిపోయింది.

## ఎదురెదురుగా నిలబడిన రెండు సైనిక దళాలు

ఎట్టకేలకు ముష్రిక్కుల సైన్యం బయటకు వచ్చింది. ఇరు సేనలు ఒకదానికొకటి అగుపిస్తున్నాయి. అప్పుడు దైవప్రవక్త (స) ఇలా దుఆ చేశారు;

"ఓ ప్రభూ! వీరు ఖురైషులు. గర్వపడుతూ, విర్రవీగుతూ నీకు వ్యతిరేకంగా సన్నద్ధులై వస్తున్నవారు. నీ ప్రవక్తను (స) తిరస్కరించేవారు. ఓ అల్లాహ్ నీ సహాయం... ఏ సహాయం అయితే నీవు చేస్తానని వాగ్దానం చేశావో ఆ సహాయం అందించు. ఓ అల్లాహ్! ఈ రోజు వారిని హతమార్చు."

అదేకాదు, దైవప్రవక్త (స), ఉత్బా బిన్ రబీయాను, అతని ఎరుపు రంగు ఒంటెపై ఎక్కి ఉండడం చూసి, "ఒకవేళ ఆ జాతిలో ఎవరి వద్దయినా కొంత మేలు ఉంటే ఆ ఎరుపు రంగు ఒంటెగల వాడి వద్దనే ఉంది, అతని మాట వింటే ఆ జాతి రుజుమార్గం పొంది ఉండేది" అన్నారు.

ఈ సందర్భంగా మహాప్రవక్త (స) ముస్లిముల వరుసలను తీర్చిదిద్దారు. వరుసలను తీరుస్తున్నప్పుడు ఓ అసాధారణ సంఘటన జరిగింది. ఆయన(స) చేతిలో ఓ బాణం ఉంది. దానితో ఆయన వరుసలను సరిచేస్తున్నారు. వరుసలో కొంత ముందుకు వచ్చి నిలుచున్న హజ్రత్ సౌదా బిన్ గజియా పొట్టపై ఆ బాణంతో నొక్కి వెనక్కు వెళ్ళి సరిగా నిలుచుండమని చెప్పారు. సౌదా(ర) దానికి,"ఓ మహాప్రవక్త (స), మీరు నన్ను బాధించారు. నాకు ప్రతిఫలం కావాలి" అని అడిగారు. దైవప్రవక్త (స) తన పొట్టపై నుండి వస్త్రాన్ని తీసి, "ఇదిగో నన్ను కూడా బాధించి మీ బాధను ఉపశమించుకొండని" ఆయన ఎదురుగా నిలబడ్డారు. సౌదా(ర) ఆయన్ను వాటేసుకొని ఆయన పొట్టను ముద్దెట్టుకోనారంభించారు.

https://teluguislam.net



"సౌదా మీరిలా ప్రవర్తించడానికి గల కారణం ఏమిటి?" అని అడిగారు ప్రవక్తశ్రీ (స).

"దైవప్రవక్తా (స), జరిగేదంతా మీకు తెలుసు. నేను ఈ అవకాశాన్ని ఉపయోగించుకొని చివరి సమయంలో నా శరీరం మీ శరీరంతో స్పృశించాలని అలా చేశాను అంతే" అన్నారు సౌదా.

మహాప్రవక్త (స) ఆయన ప్రేమానురాగాలకు అచ్చెరువొంది ఆయన్ను దీవించడం జరిగింది.

వరుసలు సరియైన తరువాత, "నా చివరి ఆదేశం వెలవడనంతవరకు ఏ ఒక్కరూ యుద్ధం ప్రారంభించకూడదు" అని ఆజ్ఞాపించారు ప్రవక్తశ్రీ (స). ఆ తరువాత యుద్ధం చేసే ప్రత్యేక విధానాన్ని చెబుతూ, "బహుదైవారాధకులు మూకుమ్మడిగా మీపై విరుచుకుపడేటప్పుడు మీరు బాణాలు వదలాలి. వారి బాణాల నుండి మిమ్మల్ని మీరు రక్షించుకోవాలి[3] (అంటే ప్రారంభం నుండే బాణాలు వదిలి వాటిని వ్యయపర్చకూడదు అని అర్థం). వారు మీపై వచ్చిపడే వరకు మీ ఖడ్గాలను ఒరల్లో నుండి బయటకు తీయవద్దు."[4] ఆ తరువాత హజ్రత్ అబూ బక్ర్(ర)ను వెంటబెట్టుకొని పందిరి వద్దకు తిరిగి వెళ్ళిపోయారు. హజ్రత్ సఅద్ బిన్ ముఆజ్ (ర) తన సైనిక దళంతో పందిరి ముందు పహరా కాస్తున్నారు.

మరో వైపు బహుదైవారాధకుల పరిస్థితి ఇలా ఉంది. అబూ జహల్ తీర్పు కోసం అల్లాహ్‌ను వేడుకుంటున్నాడు. "ఓ అల్లాహ్! మాలో ఏ వర్గం అయితే బంధుత్వాన్ని త్రెంచడానికి, దుష్ప్రవర్తన చేయడంలో మితిమీరి పోయిందో దాన్ని ఈ రోజు విరిచిపారెయ్యి. ఓ ప్రభూ! మాలోని ఏ వర్గం అయితే నీకు అధిక ప్రియమైనదో, అతి సామీప్యంగలదో దానికి నీ సహాయాన్ని అందించు" అంటూ ప్రార్థిస్తున్నాడు. ఈ విషయాన్నే ప్రస్తావిస్తూ దైవం ఈ ఆయత్‌ను అవతరింపజేశాడు.

اِنْ تَسْتَفْتِحُوْا فَقَدْ جَآءَكُمُ الْفَتْحُ ۚ وَاِنْ تَنْتَهُوْا فَهُوَ خَيْرٌ لَّكُمْ ۚ وَاِنْ
تَعُوْدُوْا نَعُدْ ۚ وَلَنْ تُغْنِيَ عَنْكُمْ فِئَتُكُمْ شَيْـًٔا وَّ لَوْ كَثُرَتْ ۙ
وَاَنَّ اللّٰهَ مَعَ الْمُؤْمِنِيْنَ ﴿١٩﴾

3. సహీ బుఖారి-2/568

4. సునన్ అబూ దావూద్-2/13

https://teluguislam.net



"మీరు గనక తీర్పును కోరితే, ఇదిగో, తీర్పు మీ ముందుకు వచ్చేసింది. కాబట్టి ఇక మానండి, అది మీకే మేలు. ఒకవేళ మీరు ఈ బుద్ధితక్కువ పనిని మళ్ళీ చేసినట్లయితే మేము కూడా మళ్ళీ అదే శిక్షను విధిస్తాము. మీ సైనిక దళం, అది ఎంత అధికంగా ఉన్నప్పటికీ, మీకు ఏ మాత్రం పనికిరాదు. అల్లాహ్ విశ్వాసులతో ఉన్నాడు." (8 : 19)

## యుద్ధారంభం - మొదటి హతుడు

ఈ యుద్ధాగ్నికి మొదటి సమిధ అస్వద్ బిన్ అబ్దుల్ అసద్ మగ్జూమీ. ఇతను తలబిరుసుగల దుష్టుడు. అతను బయలుదేరడమే ఓ ప్రమాణం చేసి బయలుదేరాడు. అతను చేసిన ప్రమాణం, "అల్లాహ్‌పై ఒట్టేసుకొని వెడుతున్నాను. ముస్లిములు కట్టిన నీటి తొట్టె నీళ్ళు త్రాగుతాను లేదా దాన్ని కూల్చేస్తాను, అదీ కాని పక్షంలో నా ప్రాణాలనైనా అర్పిస్తాను" అని. అతను అటు నుండి ముందుకు వచ్చాడో లేదో ఇటు ముస్లిమ్ సైన్యం నుండి హజ్రత్ హమ్‌జా(ర) బిన్ అబ్దుల్ ముత్తలిబ్ బయటకు వచ్చారు. ఇద్దరు నీటి తొట్టెకు ఈవలనే ఎదురుపడ్డారు. హజ్రత్ హమ్‌జా (ర) వేసిన ఖడ్గం వ్రేటుకు అస్వద్ కాలు పిక్క మధ్య నుండి తెగి వేరైపోయింది. అతను వెల్లకిలాపడిపోయాడు. అతని కాలి నుండి రక్తం ధారగా చిందనారంభించింది. అయినా అతను మోకాళ్ళపై ప్రాకుతూ నీటి తొట్టె వైపునకు వెడుతున్నాడు. తొట్టెలోనికి పడిపోయి తన ప్రమాణాన్ని నిలబెట్టుకునే లోపునే హజ్రత్ హమ్‌జా(ర) మరో వ్రేటు వేశాడు. అతను అక్కడే ప్రాణాలు వదిలేశాడు.

## తొడ చరిచి పోరుకు పిలిచినవారు

ఈ యుద్ధంలో ప్రథమంగా హతుడైన అస్వద్‌ను చూసి యుద్ధజ్వాలలు మరింత ప్రజ్వరిల్లాయి. ఆ తరువాత ఖురైష్‌కు చెందిన ముగ్గురు గుర్రపు రౌతులు ముందుకు వచ్చారు. వీరు ముగ్గురూ ఒకే కుటుంబానికి చెందిన వారు. ఒకడు ఉత్బా, రెండవ వాడు అతని సోదరుడు షైబా. వీరిద్దరు రబీయా కుమారులే. మూడవవాడు 'వలీద్.' ఇతను ఉత్బా కుమారుడు. వీరు వారి వరుసలో నుండి ముందుకువచ్చి వ్యక్తిగతంగా యుద్ధం చేయమని తొడ చరిచి పిలిచారు. వారిని ఎదుర్కోడానికి అన్సార్‌కు చెందిన ముగ్గురు యువ

https://teluguislam.net



కులు ముందుకొచ్చారు. ఒకరి పేరు ఔఫ్, రెండో ఆయన పేరు ముఅవ్విజ్ వీరిద్దరు హారిస్ కుమారులు. వీరి తల్లి పేరు 'అఫ్రా'. మూడో యువకుడు అబ్దుల్లా బిన్ రవాహా - వీరిని చూసి ఖురైష్, మీరెవరూ అని అడగ్గా, వారు మేము అన్సారులం అని జవాబిచ్చారు.

"మీరు గౌరవనీయులైన ప్రత్యర్థులు, మీతో మాకు పని లేదు. మాకు కావలసినవారల్లా మా దాయాదులు, మా సోదరులు" అన్నారు ఖురైషులు. అంతలోనే వారిలోని ఒకడు ఇలా ప్రకటించాడు.

"ఓ ముహమ్మద్(స), మా వద్దకు మా జాతికే చెందిన వారిని పంపించు." ఈ ప్రకటన విన్న దైవప్రవక్త(స), ముహాజిర్లలోని కొందరి పేర్లను పిలుస్తూ;

"ఉబైదా బిన్ హారిస్, లేచి నిలబడు! హమ్జా (ర) లేవండి! అలీ (ర) నీవు కూడా లేచి నిలబడు" అన్నారు. వీరు లేచి ఆ ముగ్గురిని మార్కొనడానికి ఖురైషుల వైపు బయలుదేరారు. ఇది చూసిన ఖురైష్, ఆగండి, మీరు ఎవరో చెప్పండి అని అడగగా, తామెవరో చెప్పారు వారు. "ఇప్పుడు మాకు సరైన జోడు" అన్నారు ఖురైషులు.

ఆ తరువాత వీరి నడుమ పోరు ప్రారంభం అయింది. అందరికంటే వయస్సులో పెద్దవారైన హజ్రత్ ఉబైదా (ర) ఉత్బా బిన్ రబీయాను, హజ్రత్ హమ్జా (ర) షైబాను, హజ్రత్ అలి(ర) వలీద్‌ను ఎదుర్కొన్నారు.[5] హజ్రత్ హమ్జా(ర) మరియు హజ్రత్ అలి(ర)లు అయితే తమ ప్రత్యర్థులను సునాయాసంగా చంపేశారు. కాని ఉబైదా(ర) మరియు ఆయన ప్రత్యర్థి నడుమ ఖడ్గయుద్ధం సాగుతూనే ఉంది. ఇద్దరిలోను ప్రతివాడూ గాయపడ్డాడు. ఇంతలోనే తమ ప్రత్యర్థుల పీచమణచిన హజ్రత్ హమ్జా(ర) మరియు హజ్రత్ అలి(ర)లు ఉత్బాపై విరుచుకుపడి అతణ్ణి మట్టుబెట్టారు. హజ్రత్ ఉబైదా(ర)ను ఎత్తుకొని తమ వారి దగ్గరకు వచ్చారు. హజ్రత్ ఉబైదా(ర)గారి కాలు తెగిపోయి ఉంది. నోట మాట కూడా లేదు. అలా ఆయన అపస్మారక స్థితిలోనే, యుద్ధం అయిపోయిన నాల్గు అయిదు రోజులు, ముస్లిములు

5. ఇబ్నె హష్షామ్, ముస్నదె అహ్మద్ మరియు అబూదావూద్ ఉల్లేఖనాలు దీనికి భిన్నంగా ఉన్నాయి. మిష్కాత్-2/343

https://teluguislam.net



మదీనాకు తిరిగి వెళ్ళే వరకు ఉండిపోయారు. సఫ్రా లోయగుండా ప్రయా ణించేటప్పుడు పరమపదించారు.

## మూకుమ్మడిగా విరుచుకుపడిన శత్రువు

వ్యక్తిగతంగా జరిగిన ఈ యుద్ధ పరిణామం చెడుగా బయల్పడ్డంతో ఖురైష్ అగ్గిమీద గుగ్గిలం అయిపోయారు. ఒకేసారి ముగ్గురు మహావీరులైన సర్దారులను పోగొట్టుకోవడం వలన వారి ఆగ్రహానికి హద్దులేకుండా పోయింది. ఒకేసారి అకస్మాత్తుగా ముస్లిములపై విరుచుకుపడ్డారు.

మరో వైపు ముస్లిములు తమ ప్రభువును సహాయపడమని వేడు కుంటూ ఆయన మార్గంలో యుద్ధం చేయడానికి తమ తమ స్థానాల్లో నిలకడగా నిలబడి శత్రువు ఎదురు దాడిని ఎదుర్కోనారంభించారు. ఇలా ఒకేచోట నిలబడి వచ్చిపడే శత్రువును చెండాడనారంభించారు. అప్పుడు వారి నోట అహద్, అహద్ అనే పదమొక్కటే వెలువడుతోంది.

## మహాప్రవక్త (స) గారి వేడుకోలు (దుఆ)

ఇటు దైవప్రవక్త (స) వరుసలను క్రమంగా తీర్చిదిద్ది పందిరి క్రిందికి చేరారు. దేవుని ముందు మోకరిల్లి తన వర్గానికి సహాయపడమని, చేసిన వాగ్దానాన్ని నెరవేర్చమని దుఆ చేయనారంభించారు. ఆ దుఆ ఇది:

"ఓ అల్లాహ్! నీవు నాతో చేసిన వాగ్దానాన్ని నెరవేర్చు. ఓ ప్రభూ! నేను ఇప్పుడు నీ వాగ్దానం, నీ ప్రమాణం గురించి అడుగుతున్నాను."

భీకర యుద్ధం ప్రారంభమై, పోరు ఉధృతమైపోగా ఇలా దుఆ చేశారు:

"ఓ అల్లాహ్! ఈ రోజు ఈ వర్గం తుడుచుకుపోతే ఇక ముందు నీ ఆరాధన చేసేవాడే ఉండడు. ఓ ప్రభూ! ఈ రోజు తరువాత నీ ఆరాధన ఇక జరగకూడదని తలుస్తున్నావా?"

మహాప్రవక్త (స) ఎంతో వినమ్రులై ఈ దుఆను చేసేటప్పుడు ఆయన భుజం మీద ఉన్న దుప్పటి క్రిందపడిపోయింది. హజ్రత్ అబూ బక్ర్(ర) ఆ దుప్పటిని ఆయన భుజాలపై కప్పుతూ, "ఓ మహాప్రవక్తా! తమరు తమ దైవంతో వినయంగా వేడుకున్నారు కదా!" అన్నారు. ఇటు అల్లాహ్ దైవదూత లకు ఇలా సంజ్ఞ చేశాడు: ఆ సంజ్ఞ దివ్యఖుర్‌ఆన్‌లో ఇలా ఉంది:

https://teluguislam.net



اَنِّیْ مَعَكُمْ فَثَبِّتُوا الَّذِیْنَ اٰمَنُوْا ؕ سَاُلْقِیْ فِیْ قُلُوْبِ الَّذِیْنَ كَفَرُوا الرُّعْبَ

"నేను మీకు తోడుగా ఉన్నాను. మీరు విశ్వాసులకు ధైర్యస్థైర్యాలను నూరిపొయ్యండి. నేను ఇప్పుడే ఈ అవిశ్వాసుల హృదయాలలో భయాన్ని సృష్టిస్తాను. కనుక మీరు వారి మెడలపై కొట్టండి. వారి కీలు కీలుపై కొట్టండి." (8 : 12)

వెంటనే మహాప్రవక్త (స) వద్దకు దివ్యావిష్కృతిని పంపుతూ;

اَنِّیْ مُمِدُّكُمْ بِاَلْفٍ مِّنَ الْمَلٰٓىِٕكَةِ مُرْدِفِیْنَ ﴿۹﴾

"నేను మీ సహాయం కోసం వేయి మంది దైవదూతలను ఒకరి తరువాత ఒకరిని ఎడతెగకుండా పంపుతున్నాను." (8 : 9)

## దైవదూతల అవతరణ

తరువాత మహాప్రవక్త (స)కు ఓ కునుకుపట్టింది. ఆ తరువాత ఆయన తలపైకెత్తి, "అబూ బక్ర్ సంబరపడండి! ఈయన జిబ్రీల్ (అ.స.), దుమ్ముధూళి మయమై వస్తున్నారు" అని చెప్పారు. ఇబ్నె ఇస్హాక్ ఉల్లేఖనం ఇలా ఉంది. "అబూ బక్ర్ సంబరపడండి! మీ వద్దకు అల్లాహ్ సహాయం వచ్చేసింది. ఈయన జిబ్రీల్ (అ.స.). తన గుర్రం కళ్ళెం పట్టుకొని వస్తున్నారు. శరీరం అంతా దుమ్ముధూళితో నిండి ఉంది."

అనంతరం మహాప్రవక్త (స) పందిరి నుండి బయటకు వచ్చారు. అప్పుడాయన కవచాన్ని ధరించి ఉన్నారు. ఉద్వేగంగా గుమ్మం వైపునకు నడుస్తూ ఇలా సెలవిస్తున్నారు:

سَیُهْزَمُ الْجَمْعُ وَیُوَلُّوْنَ الدُّبُرَ ﴿۴۵﴾

"త్వరలోనే ఈ వర్గం పరాజయం పాలవుతుంది. వారు వెన్నుజూపి పారిపోతూ కనిపిస్తారు." (54 : 45)

ఆ తరువాత ఆయన పిడికెడు గులక రాళ్ళుగల మట్టిని తీసుకొని ఖురైషుల వైపునకు మళ్ళారు. "షాహ్హతిల్ వుజూహ్, షాహ్హతిల్ వుజూహ్" (ముఖాలు వికృతంగా మారిపోవుగాక, ముఖాలు వికృతమై పోవుగాక) అని చెబుతూ ఆ మట్టిని వారి ముఖాలపై విసరికొట్టారు. బహుదైవారాధకులు

https://teluguislam.net



ఎవ్వరూ తమ కళ్ళల్లో, ముక్కుల్లో, నోటిలో ఆ మట్టి పడకుండా మిగల్లేదు. ఈ దృశ్యాన్నే వివరిస్తూ దివ్యఖుర్ఆన్ ఇలా సెలవిస్తోంది.

وَمَا رَمَيْتَ إِذْ رَمَيْتَ وَلَٰكِنَّ اللَّهَ رَمَىٰ

"కనుక యదార్థం ఏమిటంటే, వారిపై ఆ మట్టిని విసరి మీరు చంపలేదు, అల్లాహ్యే ఆ మట్టిని విసరి చంపాడు." (8 : 17)

## ఎదురు దాడి

ఇది జరిగిన వెంటనే మహాప్రవక్త(స) ఎదురు దాడి చేయమని ఆదేశిస్తూ, ముస్లిములను ఉత్సాహపరచడానికి. "షద్దూ (వారిలోకి చొరబడండి), ఎవరి చేతిలోనైతే ముహమ్మద్ (స) ప్రాణాలున్నాయో ఆయన సాక్షిగా చెబుతున్నాను! ఏ వ్యక్తి అయినా సరే స్థిరంగా నిలబడి, పుణ్యకార్యంగా భావించి ముందుకురికి, వెనక్కు మరలకుండా పోరాడి ప్రాణాలొదుల్తాడో, అతణ్ణి అల్లాహ్ తప్పకుండా స్వర్గంలో ప్రవేశింపజేస్తాడు" అని పలికారు.

ఆయన యుద్ధం చేయడానికి పురికొలుపుతూ ఇంకా ఇలా కూడా అన్నారు: "ఆ స్వర్గం వైపునకు కదలడానికి లేచి నిలబడండి, ఏ స్వర్గం వైశాల్యమైతే ఈ భూమ్యాకాశాలకు సమానమైందో (దాన్ని పొందడానికి పరుగిడండి)." దైవప్రవక్త (స) గారి ఈ మాటలు విన్న ఉమైర్ బిన్ హమ్మామ్, "ఓహో! ఓహో!" అనటం ఆరంభించారు. "నీవెందుకలా అంటున్నావు?" అని అడగగా, "కాదు! దైవసాక్షి! ఓ అల్లాహ్ ప్రవక్తా! ఏమీ లేదు, నాకు కూడా ఆ స్వర్గంలో ప్రవేశించాలనే కాంక్ష తప్ప మరే కోరికా లేదు" అన్నారాయన.

"ఔను. నీవు కూడా ఆ స్వర్గవాసుల్లోని వారిలో ఒకడివే"అన్నారు దైవప్రవక్త (స).

తన చద్ది మూట నుండి ఖర్జూరాలు తీసి తినటం ఆరంభించారు ఉమైర్ (ర). ఆ తరువాత ఆయనకు ఏదో గుర్తుకువచ్చి, నేను ఈ ఖర్జూరాలు తిన్నంతవరకు బ్రతికి ఉండాలంటే అది ఓ సుదీర్ఘకాలమే అవుతుంది అనుకొని వాటిని నేల మీద విసిరికొట్టి బహుదైవారాధకులతో పోరాడుతూ అమరగతిని పొందారు.[6]

6. ముస్లిమ్-2/139; మిష్కాత్-2/331

https://teluguislam.net



అలాగే పేరుమోసిన ఓ మహిళ 'అఫ్రా' కుమారుడు నాఫ్ బిన్ హారిస్ కూడా మహాప్రవక్త (స) దగ్గరికొచ్చి, "దైవప్రవక్తా! అల్లాహ్ తన దాసుని ఏ సత్కార్యాన్ని చూసి (ఆనందంతో) దరహాసం చేస్తాడు?" అని అడగగా, మహా ప్రవక్త (స), "తన దాసుడు తన శరీరంపై ఎలాంటి రక్షక సాధనం లేకుండా యుద్ధరంగంలోకి దుమికి శత్రువుతో తలపడతాడో, అల్లాహ్ అతణ్ణి చూసి ఆనందంతో చిరునవ్వు నవ్వుతాడు" అని చెప్పారు. ఆ మాటలు విన్న హజ్రత్ ఔఫ్ తన శరీరంపై ఉన్న కవచాన్ని తీసి పారవేసి కేవలం ఒక ఖడ్గాన్నే చేతబట్టి శత్రుమూకపై విరుచుకుపడ్డారు. అలా యుద్ధం చేస్తూనే ప్రాణాలను ధారపోసి అమరులైపోయారు.

మహాప్రవక్త (స) ఎదురు దాడికి ఆదేశం ఇచ్చినప్పుడు, శత్రువు చేసే దాడుల్లో తీవ్రత తగ్గిపోయి ఉంది. వారి ధైర్యాలు సన్నగిల్లుతున్నాయి. అందుకనే వివేచనతో కూడిన యుద్ధ కౌశల్యాన్నుపయోగించి తీసుకున్న నిర్ణయం, ముస్లిముల పరిస్థితికి మరింతగా బలం చేకూర్చింది. కారణం ఏమిటంటే, సహాబా (ర)కు ఎదురు దాడి చేయమనే ఆదేశం అందినప్పుడు వారి జిహాద్ చేసే ఉద్రేకం, ఉద్వేగం, ఉత్సాహం ఉచ్ఛస్థాయిలోనే ఉన్నాయి. అందుకనే ఓ నిర్ణయాత్మకమైన, శత్రువును తుడిచిపారవేసే దాడి చేయగలిగారు. వారు శత్రు వరుసల్లో చొరబడి వాటిని ఛిన్నాభిన్నం చేస్తూ వారి మెడలను నరుకుతూ ముందుకు వెళుతున్నారు. అదేకాకుండా మహాప్రవక్త (స) స్వయంగా కవచాన్ని ధరించి ఉత్సాహంగా వారి వైపునకు రావడం, పూర్తి నమ్మకంతో, "త్వరలోనే ఈ వర్గం పరాజయం పాలవుతుంది, వారు వెన్నుజూపి పారిపోతూ కనిపిస్తారు" అనే మాటలను అనడం విన్నారు. అందుకని ముస్లిములలో నూతన శక్తి వచ్చినట్లయింది. వారు పూర్తి బలంతో దాడి చేశారు. వారి వెంట దైవదూతలు కూడా ఉండి వారికి సహాయపడ్డారు.

ఇబ్నె సఅద్ ఉల్లేఖనంలో ఇలా ఉంది:"ఆ రోజు మనిషి తల తెగి క్రిందపడిపోయేది. ఇతణ్ణి ఎవరు చంపారో తెలిసేదికాదు. అలాగే మనిషి చేయి తెగి క్రింద పడిపోయింది. ఆ చేతిని నరికిందెవరో అగుపడేవారు కారు."

ఇబ్నె అబ్బాస్ ఇలా అంటారు: "ఓ ముస్లిమ్, ఓ బహుదైవారాధకుణ్ణి చంపడానికి అతని వెంటబడ్డాడు. హఠాత్తుగా ఆ బహుదైవారాధకునిపై కొరడా దెబ్బపడిన శబ్దం వినవచ్చింది. ఓ గుర్రపు రౌతు, "హీజూమ్ ముందుకు నడు" అని అనడమూ వినవచ్చింది. ఆ ముస్లిమ్, ఆ ముష్రిక్ దగ్గరికిపోగా అతను

https://teluguislam.net



వెల్లకిలా పడివున్నాడు. అతని ముక్కు ముఖం పచ్చడి అయిపోయాయి. కొరడాతో కొట్టినట్లు అతని శరీరం అంతా ఆకుపచ్చగా మారిపోయింది. ఆ అన్సారీ ముస్లిమ్ దైవప్రవక్తతో ఈ విషయమే చెప్పగా, 'నీవు చెప్పేది నిజం. అది మూడో ఆకాశం నుండి అందిన సహాయం అని అన్నారు." [7]

అబూ దావూద్ మాజినీ ఇలా అంటారు:

నేను ఓ ముష్రిక్‌ను చంపడానికి అతని వెంటబడ్డాను. హఠాత్తుగా అతని తల నా కరవాలం క్రిందికి రాక పూర్వమే తెగిపడిపోయింది. ఇతణ్ణి మరెవరో సంహరించారన్న విషయం అప్పుడుగాని అర్థం కాలేదు.

ఓ అన్సారి, అబ్బాస్ బిన్ అబ్దుల్ ముత్తలిబ్ (ర)ను బందీగా పట్టుకొని రాగా, అబ్బాస్ బిన్ ముత్తలిబ్ ఇలా అనసాగారు. "దైవసాక్షి! ఇతను నన్ను బంధించలేదు. నన్ను బంధించినది ఓ బట్టతల మనిషి. అతను ఎంతో అందంగా ఉండి ఓ విచిత్రమైన మచ్చలుగల గుర్రంపై ఆశీనుడై ఉన్నాడు" అని చెప్పగా, కాదు దైవప్రవక్తా! ఈయన్ను నేనే పట్టుకొని బంధించానన్నారు. అప్పుడు మహాప్రవక్త (స), "ఊరుకో! అల్లాహ్ ఓ దైవదూత ద్వారా నీకు సహాయపడ్డాడు" అన్నారు.

## యుద్ధరంగం నుండి ఇబ్లీస్ పలాయనం

ఇబ్లీస్ సురాఖా బిన్ మాలిక్ బిన్ జీషమ్ ముద్‌లజీ రూపంలో వచ్చినట్లు, అతను ఇంకా వారి వెంటే ఉన్నట్లు మనం ఇదివరకే చెప్పుకున్నాం. కాని ముష్రిక్‌లకు వ్యతిరేకంగా దైవదూతలు రంగంలోనికి దిగగానే వెన్నుజూపి పారిపోనారంభించాడు. అయితే హారిస్ బిన్ హష్షామ్ అతణ్ణి పట్టుకున్నాడు. ఇంకా అతను సూరాకా బిన్ మాలికే అని అనుకుంటున్నాడతడు. ఇబ్లీస్, హారిస్ బిన్ హష్షామ్ వక్షస్థలంపై గుద్దిన గుద్దుకు అతను వెల్లకిలా పడి పోయాడు. అతను పారిపోతూవుంటే బహుదైవారాధకులు, "సురాకా! ఎక్కడికి వెడుతున్నావు? నీవు మాకు సహాయం చేస్తానని, మమ్మల్ని విడిచి ఎక్కడికీ వెళ్ళనని మాట ఇవ్వలేదా?" అని అడిగారు. జవాబుగా ఇబ్లీస్, "నేను ఇక్కడ చూస్తున్నది మీరు చూడలేరు. అల్లాహ్ అంటే నాకు భయంగా ఉంది. ఆయన శిక్ష ఎంతో కఠినమైన శిక్ష" అంటూ పరుగెడుతూ సముద్రంలోకి దూరిపోయాడు.

7. ముస్లిమ్-2/93

https://teluguislam.net



## ఘోర పరాజయం

కొద్ది సేపట్లోనే బహుదైవారాధకుల సైన్యంలో అపజయ సూచనలు, అస్తవ్యస్త సూచనలు ప్రారంభం అయ్యాయి. వారి వరుసలు ముస్లిముల ఎడతెగని దాడులతో ఛిన్నాభిన్నమవుతున్నాయి. యుద్ధం దాని చరమ దశకు చేరుకుంది. ముష్రిక్కుల సైనిక గుంపులు అస్తవ్యస్త పరిస్థితిలో వెన్నుజూపి పారిపోనారంభించాయి. త్రొక్కిసలాట ప్రారంభమైంది. ముస్లిములు వారిని గాయపరుస్తూ, చంపుతూ, బందీలుగా పట్టుకుంటూ వారి వెంటబడ్డారు. ఇలా పూర్తిగా అపజయం పాలైపోయింది ఖురైష్ సైన్యం.

## గర్వంతో నీల్గిన అబూ జహల్

అయితే, అబూ జహల్ తన సైన్యంలో పుట్టుకొస్తున్న భయ చిహ్నాలను గమనించి ముస్లిమ్ సైన్యాన్ని అడ్డుకోవడానికిగాను, గర్వంతో నీల్గుతూ వారి భయాన్ని పోగొట్టడానికి ప్రయత్నం చేస్తున్నాడు. "సైనికులారా! సురాకా వెళ్ళిపోవడం వల్ల మీరు ధైర్యాన్ని వీడకూడదు. ముహమ్మద్ మరియు ఆయన సహచరులు ముందే అతనితో కుట్ర పన్ని అతణ్ణి అలా చేయడానికి పురికొలి పారు. మీరు ఉత్బా, షైబా మరియు వలీద్ మరణం వల్ల ధైర్యం కోల్పో కూడదు. వాళ్ళు ముగ్గురు తొందరపడి తమ మరణాన్ని ఆహ్వానించారు. లాత్ మరియు ఉజ్జా దేవుళ్ళ సాక్షి! మనం వారిందరినీ త్రాళ్ళతో బంధించి వెనక్కు తీసుకుపోనంత వరకు విశ్రమించకూడదు. చూడండి! మీలో ఏ ఒక్కరూ వారి మనుషుల్ని సంహరించకూడదు. వారిని ప్రాణాలతో పట్టుకెళ్ళి వారికి తగిన శిక్షను విధిద్దాం" అంటూ ప్రగల్భాలు పలుకుతున్నాడు.

అయితే ఇతని ఈ గర్వం కొంతసేపట్లోనే అణగారిపోయింది. ఎందు కంటే ఇతను ప్రగల్భాలు పలికిన కొంత సమయానికే ముస్లిములు ఎదురు దాడి చేయడం, ఆ ఎదురు దాడి ధాటికి ముష్రిక్కుల వరుసలు కూలిపోవడం, చిందరవందర అయిపోవడం గమనించాడతడు. అప్పటికే అతను తన చుట్టూ ముష్రిక్కుల గుంపును చేర్చుకొని- ఒకే చోట నిలబడి ఉన్నాడు. ముష్రిక్కు సైనికులు చుట్టూ మూగి అతణ్ణి కరవాలాల ప్రహారాల నుండి, బరిసెల వ్రేటుల నుండి కాపాడుతూనే ఉన్నారు. కాని ముస్లిముల సైనికులు తుఫానులా వచ్చి ఆ గుంపును కూడా చెదరగొట్టేశారు. ఆ తరువాత వారికి ఈ మహా దుష్టుడు

https://teluguislam.net



అగుపడ్డాడు. అతను ఓ గుర్రమెక్కి చక్కర్లు కొడుతున్నాడు. ఇటు ఇద్దరు అన్సారు యువకులు అతణ్ణి అంతమొందించడానికి కాచుకొని ఉన్నారు.

## అబూ జహల్ సంహారం

ఈ విషయంలో హజ్రత్ అబ్దుర్రహ్మాన్ బిన్ ఔఫ్ (ర)గారి ఉల్లేఖనం ఇలా ఉంది: "నేను బద్ర్ యుద్ధం రోజున యుద్ధం చేస్తూ శత్రు సైన్యంలో చొరబడ్డాను. హఠాత్తుగా వెనక్కు తిరిగి చూద్దును కదా, నా ఇరుప్రక్కల ఇద్దరు యువకులున్నట్లు గమనించాను. అంటే నేను ఊహించని విషయమది. అంతలోనే ఓ యువకుడు నా దగ్గరకు వచ్చి రహస్యంగా, "బాబాయి! నాకు అబూ జహల్ ఎవరో చూపించరూ?" అని అడిగాడు. "అబ్బాయీ! అబూ జహల్‌ను చూపిస్తే అతణ్ణి ఏం చేయదలుచుకున్నావు?" అని అడిగాను. "అతనా! దైవప్రవక్త (స)ను తిడుతున్నాడు. ఎవరి చేతిలోనైతే నా ప్రాణా లున్నాయో ఆ అల్లాహ్ సాక్షి! నేనేగనక అతణ్ణి చూస్తే అతణ్ణి వెంటాడుతాను. చివరికి అతనో నేనో చనిపోవలసిందే" అన్నాడు. దానికి నాకు ఆశ్చర్యం వేసింది. ఇంతలోనే మరో యువకుడు వచ్చి నన్ను సైగలతో అబూ జహల్ గురించి అడిగాడు. అంతలోనే నాకు అబూ జహల్ తన సైన్యంలో తిరుగుతూ కనబడ్డాడు. అతణ్ణి చూసి, అదుగో! వాడే మీ ఇద్దరికి కావలసిన వ్యక్తి అన్నాను. నా మాటలు విన్నంతనే ఆ ఇద్దరు కరవాలాలు దూసి అతనిపైబడ్డారు. అతణ్ణి కొట్టి చంపేశారు. ఆ తరువాత వారిద్దరు మహాప్రవక్త (స) గారి దగ్గరకు వచ్చి ఈ విషయం చెప్పగా, "మీలో ఎవరు అతణ్ణి చంపారు?" అని అడిగారు ప్రవక్తశ్రీ (స). ఆ ఇద్దరూ, నేనంటే నేను అని చెప్పారు. "మీ కరవాలాలను శుభ్రం చేశారా?" అని అడిగారు దైవప్రవక్త (స).

"లేదు. ఇంకా శుభ్రపరచలేదు" ఆ ఇద్దరి సమాధానం.

మహాప్రవక్త (స) ఆ ఇద్దరి కరవాలాలను చూసి,"మీరిద్దరూ కలసి అతణ్ణి సంహరించారు" అన్నారు. అయితే అబూ జహల్‌కు చెందిన సొత్తు అంతా ముఆజ్ బిన్ అమ్రూ బిన్ జమూహ్‌కు ఇచ్చారాయన. దాడి చేసిన ఇద్దరు యువకుల పేర్లు ముఆజ్ బిన్ అమ్రూ బిన్ జమూహ్ మరియు ముఆజ్ బిన్ అఫ్రా.[8]

---

*8. సహీ బుఖారి-1/444, 2/568; మిష్కాత్-2/352. కొన్ని ఇతర ఉల్లేఖనాల్లో ఇంకో పేరు మఊజ్ బిన్ అఫ్రా అని ఉంది (ఇబ్నె హష్షామ్-1/635). అబూ జహల్*

https://teluguislam.net



ముఆజ్ బిన్ అమ్రూ బిన్ జమూహ్ ఇలా చెప్పినట్లు ఇబ్నె ఇస్హాక్ ఉల్లేఖించారు.

అబూ జహల్ దట్టమైన చెట్టు నీడలాంటి-బరిశెలు, కరవాలాల నీడలో ఉన్నట్లు ముష్రిక్కుల నోట విన్నాను. అబుల్ హకం వద్దకు ఎవ్వరూ వెళ్ళలేరని కూడా వారనుకుంటున్నారు. నేను ఈ మాటలు విన్నంతనే అతణ్ణి గురిగా చేసుకొని అతని వైపే వెదుకుతున్నాను. అవకాశం దొరకగానే నేను అతనిపై దాడి చేశాను. నేను కొట్టిన దెబ్బకు అతని కాలు పిక్కతో సహా తెగి ఎగిరి పోయింది. రోకలి దెబ్బ తగిలి ఎగిరిపోయిన ఖర్జూరపు గింజలా ఎగిరిపోయింది ఆ కాలు. ఇటు నేను అబూ జహల్పై వ్రేటు వేయగానే అతని కుమారుడు అక్రమా నా భుజంపై తన ఖడ్గంతో వ్రేటు వేశాడు. దీనివల్ల నా గూడ వద్ద నుండి నా చేయి తెగి వ్రేళ్ళాడసాగింది. దాన్ని వెనక వేసుకొని యుద్ధం సాగిస్తూనే ఉన్నాను. మాటిమాటికి నా చేయి నాకు అడ్డం వస్తూ నన్ను బాధిస్తున్న మూలంగా దానిపై నా కాలు వేసి గట్టిగా లాగి వేరుచేసేశాను.[9] ఆ తరువాత అబూ జహల్ దగ్గరకు ముఅవ్విజ్ బిన్ అఫ్రా వచ్చారు. అతను గాయపడి ఉన్నాడు. తన ఖడ్గంతో వేసిన వ్రేటుకు అక్కడనే కుప్పకూలి పోయాడు. కేవలం అతని శ్వాస ఒక్కటే ఆడుతోంది. ఆ తరువాత ముఅవ్విజ్ (ముఆజ్) బిన్ అఫ్రా ఆ యుద్ధంలోనే అమరగతినొందారు.

యుద్ధం ముగిసిపోయింది. అబూ జహల్ గతి ఏమైందో ఎవరు తెలుసుకొస్తారు? అని మహాప్రవక్త(స) అడిగారు. సహాబా (ర) యుద్ధరంగంలో నలువైపుల తిరిగి అతని కోసం వెదుకనారంభించారు. హజ్రత్ అబ్దుల్లా బిన్ మస్ఊద్ (ర)కు అతను చివరి శ్వాస తీసుకుంటూ ఉండగా అగుపడ్డాడు. ఆయన అతని మెడపై కాలుపెట్టి తలను మొండెం నుండి వేరు చేద్దామని అతని గెడ్డం పట్టుకుంటూ, "ఓ అల్లాహ్ విరోధీ! చివరికి అల్లాహ్ నిన్ను అగౌరవంపాలు చేశాడు కదా?"అని అన్నారు. అతను ఆ మాటలు విని,

---

సామాను కేవలం ఒకే వ్యక్తికి ఇవ్వడానికి కారణం, ఆ తరువాత ముఆజ్ (మఊజ్) బిన్ అఫ్రా ఆ యుద్ధంలోనే చనిపోవడం. అబూ జహల్ కరవాలాన్ని హజ్రత్ అబ్దుల్లా బిన్ మస్ఊద్ (ర)కు ఇవ్వడం జరిగింది. ఎందుకంటే, అబూ జహల్ తల మొండెం నుండి వేరు చేసింది ఆయనే.

9. హజ్రత్ ముఆజ్ బిన్ అమ్రూ బిన్ జమూహ్, హజ్రత్ ఉస్మాన్ (ర)గారి ఖిలాఫత్ వరకు జీవించే ఉన్నారు.

https://teluguislam.net



"నన్నెందుకు అగౌరవంపాలు చేశాడు? మీరు చంపుతున్న వ్యక్తికంటే మిన్న అయినవాడు మరెవ్వడూ లేడు. అయ్యో! నన్ను పొలం దున్ని బ్రతికే కర్షకునికి బదులు మరెవరైనా హతమారిస్తే బాగుండు, ఈ రోజు విజయం ఎవరిని వరించిందో చెప్పు" అని అడిగాడు. జవాబుగా హజ్రత్ అబ్దుల్లా బిన్ మస్ఊద్, "ఇంకెవరిది, దైవప్రవక్త (స)గారిదే విజయం" అన్నారు. అది విన్న ఆ దైవ విరోధి, తన మెడపై కాలుపెట్టి ఉండడం చూసి, "ఓ మేకలు కాసేవాడా! నీవు నీ కాలును ఓ ఉన్నతమైన, క్లిష్టమైన చోట పెట్టావు" అన్నాడు. (అబ్దుల్లా బిన్ మస్ఊద్ (ర) మక్కాలో మేకలు కాస్తూ ఉండేవారన్న విషయం గమనార్హం.)

ఈ సంభాషణ అనంతరం హజ్రత్ అబ్దుల్లా బిన్ మస్ఊద్ (ర) అతని మెడను మొండెం నుండి వేరు చేశారు. దాన్ని మహాప్రవక్త(స)గారి సన్నిధికి గొనివచ్చి, "దైవప్రవక్తా! ఇదిగో! అల్లాహ్ విరోధి అబూ జహల్ శిరస్సు" అని ఆయన(స) ముందు పడవేశారు. మహాప్రవక్త (స) దాన్ని చూసి మూడుసార్లు ఇలా పలికారు. ఆయన తప్ప వేరే పూజ్యుడు లేని ఆ అల్లాహ్ సాక్షి! అల్లాహు అక్బర్. సర్వస్తోత్రాలు అల్లాహ్‌కే. ఆయన తన వాగ్దానాన్ని సత్యం చేసి చూపించాడు. తన దాసునికి సహాయం అందించి ఒక్కడే అన్ని వర్గాలను ఓడించాడు."

ఆ తరువాత అబ్దుల్లా బిన్ మస్ఊద్‌ను ఉద్దేశించి, "పదండి, అతని శవం ఎక్కడుందో చూయిద్దురుగాని, అని అడగ్గా, మేము అతని శవాన్ని ఆయన(స)కు చూపెట్టాము. ఆ శవాన్ని చూసి, "ఇతను ఈ సమాజానికి చెందిన ఫిర్ఔన్" అన్నారు దైవప్రవక్త(స).

## విశ్వాసాన్ని ఇనుమడింపజేసే సంఘటనలు

హజ్రత్ ఉమైర్ బిన్ హమామ్ మరియు హజ్రత్ ఔఫ్ బిన్ హారిస్ బిన్ అఫ్రాల ఉజ్వలమైన విశ్వాస ఘనకార్యాలను గురించి మనకు తెలిసిందే. యదార్థం ఏమిటంటే, ఈ యుద్ధంలో అడుగడుగునా, విశ్వాస పటిమ, సిద్ధాంత దృఢత్వానికి సంబంధించిన అనేక సంఘటనలు జరిగాయి. ఈ యుద్ధంలో తండ్రి తన కుమారునికి విరుద్ధంగా, సోదరుడు తన సోదరునికి వ్యతిరేకంగా యుద్ధంలో పాల్గొనడం జరిగింది. సైద్ధాంతిక విభేదం వల్ల వారు ఒకరిపై మరొకరు తమ కరవాలాలను దూసి నిలబడ్డారు. పీడితులు, దౌర్జన్యానికి

https://teluguislam.net



బలి అయిన వారు ఆ రోజు తమపై జులుమ్ చేసిన వారితో, తమను దౌర్జన్యానికి గురిచేసిన వారితో తలపడి తమ ఆగ్రహాగ్నిని చల్లార్చుకున్నారు.

1. ఇబ్నె అబ్బాస్ (ర)గారి ఉల్లేఖనం ఇలా ఉంది:

మహాప్రవక్త (స) తమ అనుచరగణంతో ఇలా అన్నారు: "బనూ హాషిమ్‌కు చెందిన కొందరిని ఖురైషులు బలవంతంగా యుద్ధరంగానికి ఈడ్చుకొని వచ్చిన విషయం నాకు తెలుసు. వారికి మా ఈ యుద్ధంతో ఎలాంటి సంబంధం లేదు. కాబట్టి బనూ హాషిమ్‌కు చెందిన వ్యక్తి ఎవరైనా మీకు తారసపడితే అతణ్ణి చంపొద్దు. అలాగే అబుల్ బక్తరీ బిన్ హష్షామ్ ఎవరికైనా ఎదురుపడితే అతణ్ణి సంహరించవద్దు. అలాగే, అబ్బాస్ బిన్ అబ్దుల్ ముత్తలిబ్ కూడా ఎదురుపడితే ఆయన్నూ చంపవద్దు. ఎందుకంటే వారంతా బలవంతంగా యుద్ధానికి తీసుకొని రాబడినవారు."

ఈ మాటలు విన్న ఉత్బా కుమారుడు హజ్రత్ అబూ హుజైఫా (ర), "ఏమిటీ! మేమైతే మా తండ్రుల్ని, సోదరుల్ని, కుమారుల్ని మరియు మా కుటుంబాలకు చెందిన వారిని సంహరించాలి. అబ్బాస్‌ను మాత్రం వదిలి వేయాలి. దైవసాక్షి! ఇది జరిగే పని కాదు, ఒకవేళ అతను గనక నాకు ఎదురైతే అతనికి నా కరవాలం రుచి చూయిస్తాను" అన్నారు.

ఈ వార్త దైవప్రవక్త (స) గారికి చేరింది. అప్పుడు అక్కడున్న హజ్రత్ ఉమర్ (ర)తో దైవప్రవక్త (స), "ఏమిటీ! దైవప్రవక్త (స) పినతండ్రి ముఖంపై కత్తితో కొడతాడా?" అని అన్నారు. ఇది విన్న హజ్రత్ ఉమర్(ర), "ఓ మహాప్రవక్తా! నన్నొదలండి. నేనా వ్యక్తి తలను నా కరవాలంతో ఎగురవేస్తాను. దైవసాక్షి! అతను మునాఫిక్ (వంచకుడు) అయిపోయినట్లుంది" అన్నారు.

ఆ రోజు తరువాత హజ్రత్ హుజైఫా (ర) తరచూ ఇలా అంటూ ఉండే వారు. "ఆ రోజు నేను అన్న మాటలకు మనస్తాపపడుతూనే ఉన్నాను. సతతం నన్ను భయం వెంటాడుతూనే ఉంది. దీనికి పరిహారం కేవలం నేను దైవ మార్గంలో ప్రాణాలిచ్చి అమరగతి పొందడం ఒక్కటే." చివరికి ఆయన యమామా యుద్ధంలో పోరాడుతూ షహీద్ (అమరులు) అయ్యారు.

2. అబుల్ బక్తరీని చంపొద్దని ఎందుకు చెప్పడం జరిగిందంటే, మక్కాలో ఈ ఒక్క వ్యక్తే దైవప్రవక్త (స)ను బాధించకుండా ఉన్న వ్యక్తి. దైవ

https://teluguislam.net



ప్రవక్తకు ఎలాంటి బాధను కలిగించడంగాని, ఆయనకు వ్యతిరేకంగా ఎలాంటి దుర్భాషలాడడంగాని అతను చేయలేదు. బనీ హాషిమ్ మరియు బనీ ముత్తలిబ్ తెగలను బాయ్‌కాట్ చేసినప్పుడు, కాబా గృహంలో వ్రేలాడదీసిన ఒప్పంద పత్రాన్ని చించిపారేసిన వ్యక్తి కూడా ఇతనే గనక.

కాని ఇంత జరిగినా అతను చంపబడ్డాడు. జరిగిందేమిటంటే, హజ్రత్ ముజ్‌జిర్ బిన్ జయ్యాద్ బల్‌వీ (ర)కి అతను యుద్ధరంగంలో ఎదురుపడ్డాడు. అతని వెంట అతని సహచరుడు కూడా ఉన్నాడు. ఇద్దరు కలిసే యుద్ధం చేస్తున్నారు. హజ్రత్ ముజ్‌జిర్ (ర) అతన్ని చూడగానే, "ఓ అబుల్ బక్తరీ! దైవప్రవక్త (స) నిన్ను చంపొద్దని ఆదేశించారు" అనగా అతను, "నా వెంట నా సహచరుడు కూడా ఉన్నాడు మరి" అన్నాడు. "లేదు. దైవసాక్షి! మేము నీ సహచరుణ్ణి మాత్రం వదిలేసేవారం కాదు" అన్నారు ముజ్‌జిర్(ర).

"దైవసాక్షి! మేమిద్దరం కలిసే చనిపోతాం" అన్నాడు అబుల్ బక్తరీ. ఇద్దరు కలసి ఆయనపై విరుచుకుపడ్డారు. విధి లేక ముజ్జిర్ (ర) అతణ్ణి చంపవలసివచ్చింది.

3. ఇస్లామ్ స్వీకరించక ముందు మక్కాలో, హజ్రత్ అబ్దుర్రహ్మాన్ బిన్ ఔఫ్ మరియు ఉమయ్యా బిన్ ఖల్ఫ్ మధ్య స్నేహ సంబంధాలుండేవి. బద్ర్ యుద్ధం రోజున ఉమయ్యా తన కుమారుడు అలీ చేయి పట్టుకొని నిలబడి ఉన్నాడు. అటు నుండే అబ్దుర్రహ్మాన్ బిన్ ఔఫ్ (ర) వెళ్ళడం తటస్థించింది. ఆయన శత్రువుల నుండి కొన్ని కవచాలు హస్తగతం చేసుకొని మోసుకు వెళుతున్నారు. ఆయన్ను చూసి ఉమయ్యా, "బహుశా నీకు నా అవసరం ఉందనుకుంటాను? నేను నీ ఈ కవచాలకంటే మేలైనవాణ్ణి. ఈ రోజు కనిపించిన దృశ్యంలాంటిది నేనిది వరకు ఎన్నడూ చూడలేదు. నీకు పాల అవసరం లేదా?" (అంటే నన్ను ఖైదు చేసిన వానికి పరిహారంగా బాగా పాలనిచ్చే ఒంటెల్ని ఇస్తాను అని అర్థం) అని అన్నాడు. ఈ మాటలు విన్న హజ్రత్ అబ్దుర్రహ్మాన్ బిన్ ఔఫ్ కవచాలన్నిటిని క్రిందపడవేసి ఆ ఇద్దరిని బందీలుగా పట్టుకొని ముందుకు సాగారు.

అబ్దుర్రహ్మాన్ బిన్ ఔఫ్ (ర)గారి కథనం ప్రకారం, "నేను ఆ ఇద్దరిని బందీలుగా పట్టుకొని వారి మధ్య నడుస్తున్నాను. అప్పుడు ఉమయ్యా నన్ను

https://teluguislam.net



అడిగాడు, "తన వక్షస్థలంపై ఉష్ట్రపక్షి ఈకలను అలంకరించుకొని యుద్ధం చేసిన ఆ వ్యక్తి ఎవరయ్యా" అని.

"ఆయన హజ్రత్ హమ్జా(ర)"అని బదులిచ్చాన్నేను.

"ఆయనేనయ్యా మా నడుమ భయం సృష్టించి యుద్ధం చేసింది" అన్నాడు ఉమయ్యా.

వారిద్దరిని పట్టుకొని నేను వెడుతూ ఉండగా హఠాత్తుగా హజ్రత్ బిలాల్ (ర) నా వెంట ఉన్న ఉమయ్యా బిన్ ఖల్ఫ్‌ను చూశారు - ఉమయ్యా బిన్ ఖల్ఫ్ మక్కాలో హజ్రత్ బిలాల్‌ను హింసించిన వాడన్న విషయం ఇక్కడ గమనార్హం- అతణ్ణి చూడగానే హజ్రత్ బిలాల్ (ర), "ఓహో! దైవధిక్కార నాయకుడవా? ఓ ఉమయ్యా బిన్ ఖల్ఫ్! ఇక నేనైనా బ్రతికుంటాను లేదా నీవైనా బ్రతికి ఉంటావు కాచుకో" అని అరిచారు. నేను, "ఓ బిలాల్! ఇప్పుడితను నా ఖైదీ" అని గుర్తు చేశాను. ఆయన వినిపించుకోకుండా, "ఇప్పుడు నేనైనా మిగిలి ఉంటాను లేదా ఇతనైనా బ్రతికి ఉంటాడు" అని బిగ్గరగా అరుస్తూ, "ఓ అన్సారుల్లారా! ఇడిగో దైవధిక్కారుల నాయకుడు ఉమయ్యా బిన్ ఖల్ఫ్! చూడండి, నేనైనా ఉండాలీ లేదా ఇతనైనా ఉండాలి" అన్నారు. ఇంతలోనే ముస్లిములు మమ్మల్ని చుట్టుముట్టి వలయాకారంగా నిలబడ్డారు. నేను ఉమయ్యాను రక్షించనారంభించాను. కాని అందులో ఒకడు కరవాలం లాగి అతని కుమారుని కాళ్ళపై వేసి కొట్టాడు. అతను నిలువునా క్రిందపడిపోయాడు. ఇటు ఉమయ్యా అరచిన అరుపును నేనెప్పుడూ వినలేదు. నేను అతనితో, పారిపో అని చెప్పాను. కాని ఈ రోజు పారిపోవడానికి కూడా అవకాశం లేదు. "దైవసాక్షి! నేను నీకు ఎలాంటి సహాయం చేయలేకపోతున్నాను" అన్నాను. ఆ తరువాత వారు ఆ ఇద్దరిని తమ ఖడ్గాలతో నరికిపారేశారు. అల్లాహ్ బిలాల్ (ర)ను కరుణించుగాక. నా కవచాలూ పోయాయి. నా ఖైదీనీ ఆయన బాధించారు.

జాదుల్ ముఆద్‌లో ఇబ్నె ఖైమ్ ఇలా రాస్తున్నారు:

"హజ్రత్ అబ్దుర్రహ్మాన్ బిన్ ఔఫ్, ఉమయ్యా బిన్ ఖల్ఫ్‌తో, నీవు మోకాళ్ళ మీద కూర్చో అనగా, అతను అలా కూర్చుండిపోయాడు. హజ్రత్ అబ్దుర్రహ్మాన్ ఢాలులా అతనిపై వంగిపోయారు రక్షించడానికి. కాని ప్రజలు క్రింది వైపు నుండి ఖడ్గ ప్రహారాలు చేసి అతణ్ణి చంపివేశారు. కొన్ని దెబ్బలు

https://teluguislam.net



హజ్రత్ అబ్దుర్రహ్మాన్ (ర) గారికీ తగిలాయి. ఆయన కాలుకు గాయం అయింది.[10]

4. హజ్రత్ ఉమర్ బిన్ ఖత్తాబ్ (ర) తన మేనమామ ఆస్ బిన్ హష్షామ్ బిన్ ముగైరాను హతమార్చారు.

5. హజ్రత్ అబూ బక్ర్(ర) తన సొంత కుమారుడు అబ్దుర్రహ్మాన్‌ను చంపారు. అప్పుడు ఈయన బహుదైవారాధకులతో ఉన్నాడు. అతనితో పోరాడుతూ అబూ బక్ర్ (ర), "ఓరీ దుష్టుడా! నా సంపద ఏదీ?" అని అడగగా, అబ్దుర్రహ్మాన్, "ఆయుధాలు, బాగా పరుగెత్తే గుర్రాలు మరియు ఈ కరవాలం తప్ప మరేదీ లేదు. ఇది వృద్ధాప్యాన్ని అంతమొందిస్తుంది" అన్నాడు.

6. ముస్లిములు ముష్రిక్కులను బంధించేటప్పుడు మహాప్రవక్త (స) పందిరిలో ఉన్నారు. హజ్రత్ సఅద్ బిన్ ముఆజ్ కరవాలం చేతబట్టుకొని పహరా కాస్తున్నారు. ప్రజల ఈ ప్రవర్తనను చూసినప్పుడు సఅద్ (ర)గారి ముఖంపై అసహనం గోచరించింది. దీన్ని చూసిన మహాప్రవక్త (స), "సఅద్! దైవసాక్షి! ముస్లిముల ఈ ఉదార ప్రవర్తన మీకు నచ్చడం లేదట్లుందే?" అని అడిగారు. "అవును దైవప్రవక్తా! దైవసాక్షిగా! ఇది బహుదైవారాధకులతో జరిగిన మొదటి యుద్ధం. ఈ అవకాశాన్ని అల్లాహ్ మనకు కల్పించాడు. అందుకని, ఈ ముష్రిక్కులను మిగిలి ఉండకుండా, మూకుమ్మడిగా సంహరిం చడమే నాకు నచ్చిన పని. వారిని పూర్తిగా అణగద్రొక్కాలి" అన్నారు.

7. ఈ యుద్ధంలో హజ్రత్ అక్కాషా బిన్ ముహ్‌సిన్ అసదీ (ర) కర వాలం విరిగిపోయింది. ఆయన దైవప్రవక్త (స) గారి దగ్గరకు వచ్చి ఆ విషయాన్ని చెప్పారు. దైవప్రవక్త (స) ఆయన చేతికి ఓ కర్రబద్దను అందిస్తూ, "అక్కాషా! దీన్తోనే యుద్ధం చేయండి" అన్నారు. ఆ కర్రబద్దను దైవప్రవక్త (స)గారి చేతి నుండి తీసుకొని ఊపగానే అది ఓ పొడపాటి దృఢమైన తళతళ లాడే తెల్ల కరవాలంగా మారిపోయింది. దాన్ని తీసుకొని వెళ్ళి యుద్ధరంగంలో చొరబడ్డారు. అల్లాహ్ ముస్లిములకు విజయాన్ని చేకూర్చేంత వరకు దానితోనే యుద్ధం చేశారు. ఆ కరవాలం పేరు ఔన్- అంటే సహాయం- అని పెట్టడం జరిగింది. ఈ కరవాలం శాశ్వతంగా అక్కాషా (ర) దగ్గరే ఉండిపోయింది.

---

*10. జాదుల్ ముఆద్-2/89; సహీ బుఖారి-కితాబుల్ వకాలా -1/308లో ఈ సంఘటన కొంత వివరంగా ఉంది.*

https://teluguislam.net



దాన్ని ఆయన పోరాటాల్లో ఉపయోగించేవారు. చివరికి సిద్దీఖీ శకంలో ముర్తిద్‌ల (ధర్మభ్రష్టులు)కు వ్యతిరేకంగా యుద్ధం చేస్తూ అమరగతిని పొందారు. అప్పుడూ ఆ కరవాలం ఆయన దగ్గరే ఉంది.

8. యుద్ధం ముగిసిన తరువాత ముస్‌అబ్ బిన్ ఉమైర్ అబ్‌దరీ (ర) తన సోదరుడైన అబూ అజీజ్ బిన్ ఉమైర్ అబ్దరీ ముందు నుండి వెళ్ళడం జరిగింది. అబూ అజీజ్ ముస్లిములకు వ్యతిరేకంగా ఆ యుద్ధంలో పాల్గొన్నవాడు. అలా వెడుతూ ఉండగా ఓ అన్సారీ అతని చేతుల్ని త్రాళ్ళతో కడుతున్నారు. ఇది చూసిన ముస్‌అబ్ బిన్ ఉమైర్ (ర) ఆ అన్సారీ సహాబీతో, "ఈ వ్యక్తి ద్వారా నీవు నీ చేతుల్ని పటిష్టపర్చుకో (అంటే ప్రయోజనం పొందు), ఇతని తల్లి గొప్ప ధనవంతురాలు. బహుశా ఆమె ఇతణ్ణి విడిపించుకోడానికి గొప్ప పరిహారమే చెల్లించుకోగలదు" అని అన్నారు. ఇది విన్న ఆయన సోదరుడు అబూ అజీజ్, హజ్రత్ ముస్‌అబ్‌నుద్దేశించి, "ఏమిటీ నా విషయంలో నీవు ఈయనకు చెప్పే విషయం ఇదా?" అని అడిగాడు.

"(ఔను) నీకు బదులు - ఈ అన్సారీయే - నాకు సోదరుడు" అని బదులిచ్చారు ఆయన.

9. బహుదైవారాధకుల శవాలను బావిలో పడవేసే ఆదేశం ఇవ్వబడి నప్పుడు ఉత్బా బిన్ రబీయా శవాన్ని బావి వైపునకు ఈడ్చుకుపోవడం జరిగింది. అప్పుడు మహాప్రవక్త (స), అతని తనయుడైన అబూ హుజైఫా(ర) ముఖం వైపు జూశారు. ఆయన విచారంతో నిలబడి ఉన్నారు. ముఖకవళికలు మారిపోయి ఉన్నాయి. ఇది చూసిన మహాప్రవక్త (స) ఆయన్నుద్దేశించి, "అబూ హుజైఫా! బహుశా మీ తండ్రి విషయమై మీ మనస్సులో ఏవో భావోద్రేకాలు ఉత్పన్నమవుతున్నట్లున్నాయే?" అని అన్నారు.

"కాదు, దైవసాక్షిగా! ఓ ప్రవక్తా! నా మనస్సులో నా తండ్రి మరణం గురించిగాని, ఆయన విషయం గురించిగాని ఎలాంటి సందిగ్ధం లేదు. అయితే నాకు తెలుసు. ఆయన ఎంతో వివేచన గలవారని, దూరదృష్టి గలవారని. అందుకనే ఆయన ఇస్లామ్ ధర్మం స్వీకరిస్తారేమో అని అనుకునేవాణ్ణి. కాని ఇప్పుడు ఆయన అంతం చూసి ఆ ఆశ కూడా సన్నగిల్లింది. దైవధిక్కార వైఖరిపైన్నే ఆయన ప్రాణాలు వదిలాడని విచారంగా ఉంది" అన్నారు. మహాప్రవక్త (స) ఆయన్ను దీవించి మెచ్చుకున్నారు.

https://teluguislam.net



## యుద్ధంలో హతులైన ఇరుపక్షాల సైనికులు

ఈ యుద్ధం, ముష్రిక్కుల ఘోర పరాజయం మరియు ముస్లిముల ఘన విజయంతో పరిసమాప్తమైంది. ఇందులో పదునాల్గు మంది ముస్లిములు షహీద్ అయ్యారు (అమరగతిని పొందారు). వారిలో ఆరుగురు ముహాజిర్లు, ఎనమండుగురు అన్సారులు. కాని బహుదైవారాధకులకు మాత్రం పెద్ద నష్టమే జరిగింది. వారిలో మొత్తం డెబ్భై మంది హతులయ్యారు. మరి డెబ్భై మంది బందీలుగా చిక్కారు. వీరంతా ముష్రిక్కుల నాయకులు, సర్దారులు, పేరుమోసిన యోధానయోధులే.

యుద్ధం ముగిసిన తరువాత మహాప్రవక్త (స) ముష్రిక్కు హతుల వద్ద నిలబడి, "మీరు మీ ప్రవక్తకు చెందిన ఎంత పెద్ద కుటుంబమో! మీరు నన్ను తిరస్కరించారు, ఇతరులు నన్ను ధృవపరిచారు. మీరు నన్ను నిస్సహాయ కునిగా వదిలేశారు, ఇతరులు నన్ను ఆదుకుని సహాయపడ్డారు. మీరు నన్ను వెడలగొట్టారు, ఇతరులు నాకు రక్షణ కల్పించారు" అని చెబుతూ, వీరందరిని ఈడ్చుకు వెళ్ళి బద్ర్‌లోని ఫలానా బావిలో పడవేయండని ఆదేశించారు. వారందరినీ అలానే ఈడ్చుకుంటూ వెళ్ళి ఆ బావిలో పడవేయడం జరిగింది.

హజ్రత్ అబూ తల్హా (ర)గారి ఉల్లేఖనం ప్రకారం, దైవప్రవక్త (స) ఆదేశం మేరకు బద్ర్ రోజున, ఖురైషులకు చెందిన ఇరువై నలుగురు గొప్ప సర్దారుల శవాలను బద్ర్‌లోని ఓ కంపుకొట్టే బావిలో పడవేయడం జరిగింది.

ఏ పోరాటంలోనైనా నెగ్గినప్పుడు, ఆ యుద్ధ మైదానంలో మూడు రోజుల వరకు ఆగి ఉండడం ఆయన(స) గారి అలవాటు. కాబట్టి బద్ర్‌లో మూడో రోజు రాగానే ఆయన ఆదేశం మేరకు ఆయన వాహనంపై అంబారీ కట్టబడింది. ఆ తరువాత ఆయన కాలినడకన నడుస్తూ ఆ బావి ఒడ్డుకు వచ్చి నిలబడ్డారు. వెంట సహాబా (ర) కూడా నడిచారు. అక్కడ నిలబడి ఆ హతుల పేరుపేరున, వారి తండ్రి పేర్లతో సహా ఒక్కొక్కరినే పిలుస్తూ, "మీరే గనక అల్లాహ్ మరియు ఆయన ప్రవక్తను విధేయించి ఉంటే నాకు సంతోషం కలిగి ఉండకపోయేదా? ఎందుకంటే మాతో మా ప్రభువు చేసిన వాగ్దానాన్ని సత్యమైనట్లు కనుగొన్నాము. మరి మీతో మీ ప్రభువు చేసిన వాగ్దానం నెరవేరిందా?" అని అనటం ప్రారంభించారు.

ఇది విన్న హజ్రత్ ఉమర్ (ర), "దైవప్రవక్తా! ఆత్మలు లేని ఈ

https://teluguislam.net



శరీరాలతోనా తమరు మాట్లాడుతూ ఉన్నది!" అని అడగగా, "ముహమ్మద్ (స) ప్రాణం ఎవరి చేతిలోనైతే ఉందో ఆ దైవం సాక్షి! నేను చెప్పిన దానికంటే అధికంగా మీరు మరే విషయాన్నీ వినలేరు" అన్నారు. మరో ఉల్లేఖ నంలో,"మీరు ఇంతకంటే మరేమీ వినలేరు. కాని వీరు సమాధానం ఇవ్వలేరు అంతే"[11] అని ఉంది.

## మక్కాకు అందిన పరాజయం కబురు

బహుదైవారాధకులు బద్ర్ మైదానం నుండి అస్తవ్యస్త రీతిలో పరుగిడుతూ భయభీతులై మక్కాకు పారిపోనారంభించారు. ఎదురైన పరాజయానికి కుంచించుకుపోయి తల ఎత్తలేని స్థితిలో సిగ్గుపడుతూ వస్తున్నారు. మక్కాలో ఎలా ప్రవేశించాలో వారికి అర్థం కావడం లేదు.

ఇబ్నె ఇస్హాక్ కథనం ప్రకారం, అందరికంటే ముందు ఏ వ్యక్తి అయితే మక్కాకు పరాజయం కబురు తెచ్చాడో, అతడు 'హైస్మాన్ బిన్ అబ్దుల్లా ఖుజాయి.' అతణ్ణి చూడగానే ప్రజలు ఎగబడి యుద్ధ వార్తలేమిటో చెప్పమని అడిగారు. అతను నోరువిప్పుతూనే, "ఉత్బా బిన్ రబీయా, షైబా బిన్ రబీయా, అబుల్ హకం బిన్ హష్షామ్, ఉమయ్యా బిన్ ఖల్ఫ్ - ఇంకా కొందరు సర్దారుల పేర్లు చెబుతూ - వీరంతా వధించబడ్డారు" అని అన్నాడు. అతను చెప్పిన జాబితాలో అందరూ ఖురైష్‌కు చెందిన గౌరవనీయులైన సర్దారుల పేర్లే ఉన్నాయి. సుఫ్వాన్ బిన్ ఉమయ్యా అనేవాడు అక్కడనే హతీమ్ గోడపై కూర్చుని ఉన్నాడు. అది విన్నతోడనే, "దైవసాక్షి! ఇతనే గనక స్పృహలో ఉంటే నా గురించి అడిగి చూడండి తెలుస్తుంది" అని అన్నాడు. ప్రజలు నిజంగానే, "సుఫ్వాన్ బిన్ ఉమయ్యా ఏమయ్యాడూ?" అని అడగగా, "అతను అడిగో! హతీమ్ గోడపై కూర్చొని ఉన్నాడు. దైవసాక్షి! అతని తండ్రి, అతని సోదరుడు చంపబడుతుండగా నేను స్వయంగా నా కళ్ళతో చూసొచ్చాను" అన్నాడు.

మహాప్రవక్త (స)గారి ద్వారా బానిస సంకెళ్ళ నుండి విముక్తులైన హజ్రత్ అబూ రాఫె (ర) కథనం ఇలా ఉంది.

నేను ఆ రోజుల్లో హజ్రత్ అబ్బాస్ (ర)గారి బానిసగా ఉన్నాను. మా ఇంట్లో ఇస్లాం ప్రవేశించింది. హజ్రత్ అబ్బాస్ (ర) ఇస్లామ్ స్వీకరించి ఉన్నారు.

---

11. ముత్తఫిఖున్ అలైహి-మిష్కాత్-2/345

https://teluguislam.net



ఉమ్ముల్ ఫజ్ల్ కూడా ముస్లిముగా మారిపోయారు. నేను కూడా ఇస్లామ్‌ను స్వీకరించే ఉన్నాను. అయితే హజ్రత్ అబ్బాస్ (ర) మాత్రం తమ ఇస్లామ్ స్వీకారాన్ని రహస్యంగానే ఉంచారు. ఇటు అబూ లహబ్ బద్ర్ యుద్ధంలో పాల్గొనలేదు. అతనికి ఈ కబురు అందగానే అతను సిగ్గుపడిపోయాడు. అతన్ని అవమానం ఆవహించింది. మాకు మాత్రం సంతోషం కలిగి మాలో ఓ క్రొత్త బలం వచ్చినట్లు అయింది. నేను ఓ బలహీనుణ్ణి, బాణాలు (అంబులు) తయారు చేయడం నా వృత్తి. జమ్‌జమ్ బావి వద్ద ఉన్న గుడారంలో కూర్చుని అంబుల పుల్లల్ని చెక్కేవాణ్ణి. ఆ సమయంలో ఆ గుడారంలో కూర్చుని వాటిని చెక్కుతున్నాను. నా ప్రక్కన ఉమ్ముల్ ఫజ్ల్ కూడా కూర్చుని ఉన్నారు. ఈ వార్త అప్పుడే మా చెవిన పడగా మేము ఆనందంతో సతమతమవుతున్నాము. అప్పుడే అబూ లహబ్ కాళ్ళీడ్చుకుంటూ మా దగ్గరకు వచ్చి ఆ గుడారంలో ఓ మూలన కూర్చున్నాడు. అతని వీపు నా వీపు వైపున ఉంది. కూర్చున్నాడో లేదో ఒక్కసారే గోల వినిపించింది. "అడిగో అబూ సుఫ్‌యాన్ బిన్ హారిస్ బిన్ అబ్దుల్ ముత్తలిబ్ వచ్చాడు" అనే మాటలు వినబడ్డాయి. అతను అబూ సుఫ్‌యాన్‌ను తన వద్దకు పిలిపించుకొని అడిగాడు. "ఇటురా! నా వయస్సు సాక్షిగా చెప్పు. ఏం వార్తలో" అని. అతను అబూ లహబ్ వద్ద కూర్చున్నాడు. జనం అంతా నిలబడే ఉన్నారు. "కుమారా! చెప్పు వారి పరిస్థితి ఎలా ఉంది?"

"ఏమీ లేదు! వారికి మాకు నడుమ యుద్ధం జరిగింది. మేము మా భుజాల్ని వారికి అందించాం. వారు మమ్మల్ని ఎలా చంపాలో అలా చంపేశారు. ఎలా బందీలుగా పట్టుకోవాలో వారిష్టమొచ్చినట్లు మమ్మల్ని బందీలుగా పట్టుకున్నారు. దైవసాక్షి! అయినా నేను వారిని తూలనాడడం లేదు. యదార్థం ఏమిటంటే, మేము ఎదుర్కొన్నది ఎర్రగా, ఎత్తుగా ఉన్న స్ఫురద్రూపుల్ని. వీరు భూమికీ ఆకాశానికి నడుమ విచిత్రమైన మచ్చలుగల గుర్రాలపై ఎక్కి ఉన్నారు. దైవసాక్షి! వారు దేన్నీ వదల్లేదు. మరేదీ వారికి దీటుగా రాలేక పోయింది."

నేను వెంటనే గుడారం పరదాను పైకెత్తి ఇంకెవరూ? దైవసాక్షి! వారు దైవదూతలే అని అన్నాను. ఆ మాట విన్న అబూ లహబ్ తన చేయి పైకెత్తి నా చెంప పగిలేటట్లు కొట్టాడు. నాకూ కోపం వచ్చింది. అతణ్ణి ఎదుర్కొన్నాను. అయితే అతను నన్నుపైకెత్తి భూమ్మీద పడేశాడు. ఆ తరువాత తన మోకాలిపై కూర్చుని నన్ను కొట్టనారంభించాడు. ఇంతలోనే ఉమ్ముల్ ఫజ్ల్ గుడారపు ఓ

https://teluguislam.net



గడను పీకి అతని తల పగిలేటట్లు కొట్టారు. అతని తల పగిలి రక్తం కారసాగింది. వెంటనే ఆమె అతణ్ణి ఉద్దేశించి, "అతని యజమాని ఇక్కడ లేనందుకే గదా బలహీనుడనుకొని కొట్టావు" అని అనగా, అతను సిగ్గుతో తల దించుకొని అక్కడి నుండి వెళ్ళిపోయాడు. అల్లాహ్ ఓ వారం తిరగక మునుపే అతనికి ఓ భయంకరమైన 'అద్సా' అనే వ్యాధికి గురి చేశాడు (అద్సా ప్లేగులాంటి ఓ వ్యాధి). ఆ వ్యాధితోనే అతను అంతమైపోయాడు. అద్సా బొబ్బల్ని అరబ్బులు పెద్ద అపశకునంగా భావించేవారు కాబట్టి, (చనిపోయిన తరువాత) అతని కుమారులు కూడా అతని దగ్గరకు రాలేదు. రెండు మూడు రోజులు అలానే గడిచిపోయాయి. అతని దగ్గరకు పోవడంగాని, అతణ్ణి పూడ్చి పెట్టడానికిగాని వారికి ధైర్యం చాలడం లేదు. అలా వదిలి పెట్టడం వల్ల ప్రజలు తమను తూలనాడగలరనే భయంతో అక్కడనే ఓ గోతి తీసి ఆ శవాన్ని అందులోని కర్రల సహాయంతో నెట్టి పడవేశారు. దూరం నుండే రాళ్ళు రువ్వి ఆ గోతిని పూడ్చివేశారు.

మొత్తానికి మక్కావాసులకు బద్ర్ మైదానంలో ఘోర అపజయం ఎదురైన కారణంగా వారిపై పడిన దుష్ప్రభావం అంతా ఇంతా కాదు. వారు చనిపోయిన వారిని గురించి 'నౌహా' (ఏడ్వడం) చేయడానికి కూడా అనుమతించలేరు. ఇలా నౌహా చేయడం వలన ముస్లిములకు తమ విజయంపై పొంగిపోయే అవకాశం లభిస్తుంది అని వారి అనుమానం.

దీనికి సంబంధించిందే ఆసక్తికరమైన సంఘటన ఒకటి జరిగింది. బద్ర్ యుద్ధంలో అస్వద్ బిన్ అబ్దుల్ ముత్తలిబ్ అనే ఆయన ముగ్గురు కుమారులు హతులయ్యారు. వారి కోసం అతను రోదించదలిచాడు. అతను గ్రుడ్డివాడు. ఓ రాత్రి అతను ఓ ఏడ్చే మహిళ గొంతు విని తన బానిసను విషయం తెలుసుకురమ్మని అక్కడికి పంపించాడు, ఏడ్చే అనుమతి లభించిందేమో అనే ఆశతో. ఖురైషులకు తమ హతులను గురించి 'నౌహా' చేసే అనుమతి లభించిందేమో, ఆ మహిళ అందుకే ఏడుస్తుందేమో కూడా తన కుమారుడు అబూ హకీమాను తలుచుకొని ఏడ్వవచ్చని అతని ఆశ. బానిస తిరిగి వచ్చి ఆ స్త్రీ జాడలేకుండా పోయిన తన ఒంటెను తలుచుకొని ఏడుస్తోంది అని సమా చారం అందించాడు. 'అస్వద్' ఇది విని, తనను తాను సంభాళించు కోకుండా ఇలా అన్నాడు.

https://teluguislam.net



"ఏమిటీ! ఆమె తన ఒంటె పోయిందని ఏడుస్తూ ఉందా? దాని కోసం నిద్రను పాడుచేసుకుంటుందా? (ఆమెతో చెప్పు) పోయిన ఒంటె కోసం ఏడ్వవద్దని. అదృష్టాలు మట్టిలో కలిసిపోయిన ఆ బద్ర్ కోసం ఏడ్వమను. అవును! ఆ బద్ర్ యుద్ధాన్ని తలుచుకొని ఏడ్వమను. ఎక్కడైతే బనీ హసీస్, బనీ మగ్జూమ్ మరియు అబుల్ వలీద్‌కు చెందిన తెగల సర్దారులు, వ్యక్తులు చనిపోయారో. ఏడ్వదలుచుకుంటే అకీల్ కోసం ఏడ్వమను, హారిస్ కోసం ఏడ్వమను. అతను పులులకు పులి. వారి కోసమే ఏడ్వమను. అందరి పేర్లు చెప్పి మరీ ఏడ్వమను. అబూ హకీమా? అతనికి సాటి ఎవరూ లేరు. చూడూ! అతని తరువాత అందరూ సర్దారులై పోతున్నారు. బద్ర్ యుద్ధం జరగకుండా ఉండి ఉంటే, వారిలో ఏ ఒక్కడూ సర్దారు కాకపోయేవాడు."

## మదీనాకు అందిన విజయ శుభవార్త

ఇటు ముస్లిములకు పూర్తి విజయం లభించగా దైవప్రవక్త (స) మదీనా ప్రజలకు ఈ శుభవార్తను త్వరగా అందించడానికి ఇద్దరు మనుషుల్ని పంపించారు. పంపబడిన వారిలో హజ్రత్ అబ్దుల్లా బిన్ రవాహా (ర) ఒకరు. ఈయన ఎగువ మదీనాలో ఉన్న వారి కోసం ఈ శుభవార్తను తీసుకు వెళ్ళారు. రెండవవారు హజ్రత్ జైద్ బిన్ హారిసా (ర). ఈయన్ను దిగువ మదీనా ప్రజల వద్దకు పంపించడం జరిగింది.

ఈలోపు యూదులు మరియు మునాఫిక్‌లు (కపట ముస్లిములు) మదీనాలో ప్రాపగండ ద్వారా ప్రజల్ని భయభీతులుగా చేస్తున్నారు. చివరికి దైవప్రవక్త (స) కూడా యుద్ధంలో హతులయ్యారని కూడా ప్రచారం చేశారు. ఓ మునాఫిక్ మహాప్రవక్త (స)గారి ఒంటెపై ఎవరో వ్యక్తి ఎక్కి వస్తుండగా చూసి, "ఇంకేముందీ! ముహమ్మద్ (స) యుద్ధంలో చంపబడ్డారు, అదిగో చూడండి, అది ఆయన ఒంటె! మేము దాన్ని గుర్తించగలం. ఆ వ్యక్తి జైద్ బిన్ హారిసా (ర), యుద్ధంలో ఓడిపోయి పారిపోయి వస్తున్నాడు, ఏం చెప్పాలో పాలుపోక దిక్కులు చూస్తున్నాడంటూ" సంబరపడిపోతూ అరిచాడు. మొత్తానికి, ఆ ఇద్దర[illegible]హరులు మదీనా చేరగా ముస్లిములు వారిని చుట్టుముట్టారు. వివరాలన[illegible]లుసుకున్న తరువాత, ముస్లిములు ఘన విజయాన్ని సాధించార[illegible]తెలిసిపోయింది. ఎటు చూసినా ఆనందమే. మదీనా ఇళ్ళు,

https://teluguislam.net



వాడలు అన్నీ దైవ నామస్మరణతో మారుమ్రోగుతున్నాయి. మదీనాలోనే ఉండిపోయిన పెద్దలు దైవప్రవక్త (స)కు శుభాకాంక్షలు తెలుపడానికి మదీనా నుండి బయలుదేరి బద్ర్ మార్గం పట్టారు.

హజ్రత్ ఉసామా బిన్ జైద్ (ర) గారి కథనం ఇలా ఉంది:

"మాకు విజయ శుభవార్త మహాప్రవక్త (స) గారి కుమార్తె హజ్రత్ రుఖయ్యా (ర) గారిని ఖననం చేసేటప్పుడు తెలిసింది. ఈమె హజ్రత్ ఉస్మాన్ (ర)గారికి సతీమణి. ఆమె వ్యాధిగ్రస్తులుగా ఉన్న కారణంగా పరిచర్యలు చేయడానికిగాను హజ్రత్ ఉస్మాన్ (ర)ను దైవప్రవక్త (స) మదీనాలోనే వదిలిపెట్టి వెళ్ళారు."

## యుద్ధంలో లభించిన యుద్ధధనం సమస్య

మహాప్రవక్త (స) యుద్ధం ముగిసిన తరువాత మూడు రోజుల వరకు బద్ర్‌లోనే ఉండిపోయారు. ఆయన (స) బద్ర్ మైదానం నుండి బయలుదేరడానికి సిద్ధపడుతున్నప్పుడే, యుద్ధధనం విషయంలో అభిప్రాయ భేదాలు పొడసూపాయి సైన్యంలో. ఈ విభేదాలు తీవ్రస్థాయికి చేరగానే, దైవప్రవక్త (స), ఎవరి వద్ద ఏ సొత్తు అయితే ఉందో తనకు అప్పగించమని ఆదేశించారు. సహాబా (ర) ఆయన ఆదేశాలను వెంటనే అమలు చేశారు. ఆ తరువాత అల్లాహ్ వహీ (దివ్యవాణి) ద్వారా ఈ సమస్యకు పరిష్కారం చూపెట్టాడు.

హజ్రత్ ఉబాదా బిన్ సామత్ (ర)గారి ఉల్లేఖనం ఇలా ఉంది:

మేము మదీనా నుండి బయలుదేరి బద్ర్‌కు చేరుకున్నాం. అక్కడ సంకుల సమరం జరిగింది. అల్లాహ్ శత్రువుకు అపజయాన్ని కలిగించాడు. ఆ తరువాత మాలోని ఓ వర్గం శత్రువులను వెన్నాడుతూ వారి వెనుకగా వెళ్ళింది. వారిని వెంటాడి తరిమికొట్టి చంపింది. మరో వర్గం ఖురైష్‌కు సంబంధించిన సొమ్మును లూటీ చేసి ప్రోగు చేయడంలో నిమగ్నమైంది. ఇంకొక వర్గం మహాప్రవక్త (స)ను చుట్టుముట్టి, శత్రువు తిరిగి దాడి చేయకుండా కాపాడనారంభించింది. రాత్రి బాగా ప్రొద్దుపోయినప్పుడు అందరూ ఒక చోట చేరగానే, ధనాన్ని ప్రోగుచేసినవారు, "ఈ ధనాన్ని మేమే ప్రోగు చేశాం, ఇందులో మరెవ్వరికీ వాటా లేదన్నారు. "శత్రువును వెన్నాడిన వర్గం వారు, "మీరు మా

కంటే ఎక్కువ హక్కుదారులు కారు. మేము శత్రువును పారద్రోలడంలోనూ, మీ దగ్గరకు చేరకుండా ఉంచడంలోనూ సహాయపడ్డాం" అన్నారు. దైవప్రవక్త (స) గారి చుట్టూ చేరి ఆయన ప్రాణాలను కాపాడే ప్రయత్నం చేసిన వర్గం, "శత్రువు ఏమరుపాటులో వచ్చి దైవప్రవక్త(స)పై దాడిచేసే భయం ఉన్నందువల్లనే మేము ఆయన చుట్టూ చేరి పహరా కాశాం" అని అంది. ఈ జగడం గురించే అల్లాహ్ ఈ ఆయత్‌లను అవతరింపజేసి దాన్ని పరిష్క రించాడు.

يَسْـَٔلُونَكَ عَنِ الْاَنْفَالِ ۗ قُلِ الْاَنْفَالُ لِلّٰهِ وَالرَّسُولِ ۚ فَاتَّقُوا اللّٰهَ وَاَصْلِحُوا ذَاتَ بَيْنِكُمْ ۖ وَاَطِيعُوا اللّٰهَ وَرَسُولَهٗٓ اِنْ كُنْتُمْ مُّؤْمِنِيْنَ ①

"వారు నిన్ను, 'అన్‌ఫాల్' (అల్లాహ్ అనుగ్రహం వలన లభించిన యుద్ధ ధనం) గురించి అడుగుతున్నారు. ఇలా అను: ఈ అన్‌ఫాల్ అల్లాహ్‌కు, ఆయన ప్రవక్తకూ చెందుతాయి. కనుక మీరు అల్లాహ్‌కు భయపడండి. మీ పరస్పర సంబంధాలను సంస్కరించుకోండి. అల్లాహ్‌కూ ఆయన ప్రవక్తకూ విధేయత చూపండి, మీరు గనక విశ్వాసులే అయితే." (8: 1)

ఆ తరువాత దైవప్రవక్త (స) అల్లాహ్ ఆదేశం మేరకు ఆ యుద్ధధనాన్ని ముస్లిములకు పంచిపెట్టారు.[12]

## మదీనాకు పయనమైన ఇస్లామీయ సైన్యం

దైవప్రవక్త (స) మూడు రోజుల అనంతరం బద్ర్ నుండి మదీనాకు బయలుదేరారు. ఆయన వెంట ముష్రిక్కు ఖైదీలు కూడా ఉన్నారు. వారితో పాటు యుద్ధంలో వారి నుండి హస్తగతం చేసుకున్న ధన సంపద కూడా ఉంది. ఆ సంపద పరిరక్షణ బాధ్యత హజ్రత్ అబ్దుల్లా బిన్ కఅబ్ (ర)గారికి అప్పగించడం జరిగింది. మహాప్రవక్త (స) 'సఫా' లోయ నుండి బయటకు వచ్చి కనుమకు మరియు కనుమకు నడుమన గల ఓ ఎత్తయిన దిబ్బపై మకాం వేశారు. అక్కడే 'ఖమ్స్'(అయిదింట ఒక భాగం యుద్ధధనం) వేరు చేశారు. తక్కిన నాల్గు భాగాలను ముస్లిముల్లో సమానంగా పంచిపెట్టారు.

12. ముస్నదె అహ్మద్-5/323, 324; హాకిమ్-2/326

https://teluguislam.net



నజ్ర్ బిన్ హారిస్‌ను చంపేయమని ఆ ప్రదేశంలోనే ఆదేశం ఇవ్వడం జరిగింది. కారణం ఏమిటంటే, అతను బద్ర్ యుద్ధంలో ముష్రిక్కుల పతాకాన్ని ఎత్తుకొని ఉన్న వ్యక్తి, అంతేకాదు, ఖురైషులకు సంబంధించిన గొప్ప నేరగాళ్ళలో ఒకడు కూడా. ఇస్లామ్ ధర్మాన్ని వ్యతిరేకించడంలోనూ, మహాప్రవక్త (స)ను బాధించడంలోను అందరికంటే ముందుండేవాడు. మహాప్రవక్త (స)గారి ఆదేశంపై హజ్రత్ అలి (ర) అతని మెడను నరికివేశారు.

ఆ తరువాత దైవప్రవక్త (స) అర్క్కుజ్ జబియా అనే ప్రదేశానికి చేరగానే 'ఉత్బా బిన్ ముఅయిత్‌ను చంపేయమని ఆదేశించారు. ఇతను దైవ ప్రవక్త(స)ను హింసిస్తూ ఉండేవాడు. ఇతని గురించి ఇదివరకే చెప్పుకున్నాం. మహాప్రవక్త (స) నమాజు చేసేటప్పుడు ఆయన వీపుపై ఒంటె పొట్టపేగుల్ని పడవేసింది కూడా ఇతనే. అంతేకాదు, తన దుప్పటిని ఆయన మెడకు చుట్టి ఆయన్ను చంపే ప్రయత్నం కూడ చేశాడు. ఆ సమయంలో హజ్రత్ అబూ బక్ర్(ర) వచ్చి మహాప్రవక్త (స)ను రక్షించకపోతే (తాను తలచినట్లు) గొంతు నులిమి చంపేసేవాడే. మహాప్రవక్త (స) ఇతని తలను తొలగించమని ఆదేశించి నప్పుడు అతను, "ఓ ముహమ్మద్! నా పిల్లల గతేమిటీ?" అని అడగగా, 'అగ్నే'[13] అని బదులిచ్చారు దైవప్రవక్త (స). ఆ తరువాత హజ్రత్ ఆసిమ్ బిన్ సాబిత్ (ర) లేదా హజ్రత్ అలి (ర) అతని తలను నరికేశారు.

యుద్ధనీతి దృష్ట్యా ఆ ఇద్దరి తలలను ఖండించవలసిన అవసరం ఎంతైనా ఉంది. వారు కేవలం ఖైదీలు మట్టుకే కాదు, నేటి ఆధునిక పదజాలం ప్రకారం యుద్ధ నేరస్తులు.

## శుభాకాంక్షలు చెబుతూ ఎదురుగా వచ్చిన బృందాలు

మహాప్రవక్త (స) 'రౌహా' అనే ప్రదేశానికి చేరగానే, ఆ ఇద్దరు వార్తా హరుల ద్వారా అందిన శుభవార్తలు విని దైవప్రవక్త(స)ను ఆహ్వానించడానికి, ఆయనకు శుభాభినందనలు తెలుపడానికి మదీనా నుండి బయలుదేరి వచ్చినవారు ఎదురయ్యారు. వారు ప్రవక్త (స)ను చూడగానే అభినందనలు తెలుపుతూ ఉండగా, హజ్రత్ సల్మా బిన్ సలామా(ర) వారినుద్దేశించి, "మీరు

---

13. ఈ హదీసు సిహా గ్రంథాల్లో ఉంది. ఉదాహరణకు చూడండి: సునన్ అబూ దావూద్-3/12

https://teluguislam.net



మాకు అభినందనలు తెలుపుతున్నారా? ఎందుకు? మేము ఢీకొన్నది బట్టతల వృద్ధ యోధుల్ని, వారి తలలు ఒంటె తలల్లా అగుపడ్డాయి మాకు" అని అన్నారు. ఇది విన్న మహాప్రవక్త (స) చిరునవ్వు నవ్వుతూ , "సోదర కుమారా! వీరేనయ్యా వారి జాతిలోని గొప్ప యోధానయోధులు" అన్నారు.

ఆ తరువాత హజ్రత్ అసీద్ బిన్ హజీర్ (ర) దైవప్రవక్త(స)తో, "దైవప్రవక్తా! స్తోత్రాలన్నీ అల్లాహ్‌కే. ఆయనే తమకు విజయాన్ని చేకూర్చింది. తమ కళ్ళు చల్లబడ్డాయి. దైవసాక్షి! మీరు శత్రువులను ఢీకొంటారని నేను అనుకోలేదు. అది కేవలం ఓ వర్తక బిడారం వ్యవహారమే కదా అని నేను మదీనాలో ఉండి పోయాను. శత్రువుతో ఢీకొనవలసి ఉంటుందని నేననుకుంటే నేను వెనుకబడి ఉండేవాణ్ణికాదు" అని విన్నవించుకున్నారు. మహాప్రవక్త (స), "అవును మీరు చెప్పేదే సరియైనది" అని బదులిచ్చారు.

దైవప్రవక్త (స) దైవ సహాయంతో విజేతలై మదీనా నగరంలో కాలు పెట్టారు. ఆ పట్టణం మరియు చుట్టుపట్ల ప్రాంతాల్లో ఉన్న ఆయన శత్రువులపై ఆయన ప్రభావం ప్రాభవం కూడా పడింది. విజయ ప్రభావం కారణంగా మదీనాకు చెందిన అనేక మంది ఇస్లామ్ ధర్మాన్ని స్వీకరించారు. ఈ సందర్భంలోనే అబ్దుల్లా బిన్ ఉబై మరియు అతని అనుచరులు కూడా విధిలేక అందరికీ తెలియాలనే ఉద్దేశ్యంతో ఇస్లామ్ ధర్మాన్ని స్వీకరించారు.

దైవప్రవక్త(స) మదీనా చేరిన మరునాడుగాని ఖైదీలు మదీనాకు రాలేకపోయారు. ఆయన(స) వారిని సహాబా (ర)కు పంచిపెడుతూ వారి పట్ల సత్ప్రవర్తనతో మెలగాలి అని ఉద్బోధించారు. ఈ ఉద్బోధ ఫలితంగా సహాబా (ర) తాము స్వయంగా ఖర్జూరాలు తిని, తమ ఖైదీలకు రొట్టె తినిపించేవారు. (మదీనాలో ఖర్జూరానికి అంత విలువ లేదు. రొట్టె ఎంతో ప్రియమైన వంటకం అనేది గమనార్హం).

## ఖైదీల సమస్య - దాని పరిష్కారం

దైవప్రవక్త (స) మదీనాకు చేరగానే, సహాబా (ర) ఖైదీల గురించి సలహాలడిగారు. హజ్రత్ అబూ బక్ర్ సిద్దీఖ్(ర) ఇలా అన్నారు: "ఓ మహాప్రవక్తా (స)! వీరు దాయాదులు(అంటే పినతండ్రుల కుమారులు). మన కుటుంబాలకు, మన వంశానికి చెందినవారు. నా సలహా ప్రకారం తమరు వీరి నుండి

https://teluguislam.net



ఫిదియా (పరిహారం) తీసుకొని వదిలేయండి. మనం వారి నుండి పొందిన ధనం, ఈ దైవధిక్కారులకు వ్యతిరేకంగా మనకు బలం చేకూర్చుతుంది. బహుశా అల్లాహ్ మునుముందు వారికి మార్గదర్శన భాగ్యం కలిగిస్తాడేమో. అప్పుడు వారు మనకు అండగా నిలుస్తారేమో."

ఆ తరువాత హజ్రత్ ఉమర్ (ర) గారిని ఉద్దేశించి దైవప్రవక్త (స), "ఓ ఉమర్! నీ సలహా ఏమిటి?" అని అడిగారు. దానికి హజ్రత్ ఉమర్(ర) ఇచ్చిన సలహా ఇది:

"దైవసాక్షి! నా సలహా హజ్రత్ అబూ బక్ర్ (ర) ఇచ్చిన సలహాకు పూర్తిగా వ్యతిరేకం. నా సలహా ఏమిటంటే, తమరు ఫలానా వ్యక్తిని- ఎవరైతే ఉమర్‌కు దగ్గరి బంధువో- నాకు అప్పగించండి. నేను అతని తలను ఖండిస్తాను. అకీల్ బిన్ అబీ తాలిబ్‌ను - హజ్రత్ అలీ సోదరుడు- అలీ (ర)కి అప్పజెప్పండి. ఆయన అతని తలను నరికేస్తాడు. హమ్‌జా(ర)కు సోదరుడైన ఫలానా వ్యక్తిని హమ్‌జా(ర)కు అప్పజెప్పండి. ఆయన అతని తలను ఖండిస్తారు. చివరికి అల్లాహ్‌కు తెలిసిపోవాలి మా హృదయంలో ముష్రిక్‌ల కోసం ఎలాంటి దయ లేదని. వీరంతా ముష్రిక్‌ల సర్దారులు, నాయకులూను."

హజ్రత్ ఉమర్ (ర)గారి ఉల్లేఖనం ఇలా ఉంది: మహాప్రవక్త (స) నా సలహాకు విలువ ఇవ్వకుండా హజ్రత్ అబూ బక్ర్(ర)గారి సలహాకే విలువ నిచ్చారు. కాబట్టి ఖైదీల నుండి ఫిదియా తీసుకోడానికే నిర్ణయం అయింది. ఆ తరువాత మరుసటి రోజు నేను ఉదయాన్నే దైవప్రవక్త (స)గారి సన్నిధికి రాగా మహాప్రవక్త (స) మరియు అబూ బక్ర్(ర) ఇద్దరు కలసి రోదించడం చూశాను. నేను, "ఓ దైవప్రవక్తా (స)! విషయం ఏమిటో నాకు చెప్పండి. మీరూ, మీ స్నేహితుడు ఇద్దరూ కలిసి ఎందుకు రోదిస్తున్నారో. ఆ కారణం ఏదో తెలిస్తే నేను మీతోపాటే ఏడుస్తాను. ఆ కారణం తెలియకపోయినా మీరిద్దరు కలసి రోదిస్తున్నారు కాబట్టి నేనూ రోదిస్తాను" అన్నాను. దానికి దైవప్రవక్త (స), "ఫిదియా తీసుకునే నిర్ణయం కారణంగా, మీ మిత్రులకు పడబోయే శిక్షను చూసి రోదిస్తున్నాను" అంటూ దగ్గరలో ఉన్న ఓ చెట్టును చూపిస్తూ, "నాకు వారిపై పడనున్న శిక్షను, ఆ చెట్టుకంటే దగ్గరగా చూపించడం జరిగింది.[14] అల్లాహ్ ఈ ఆయత్‌ను అవతరింపజేశాడు"అన్నారు.

14. తారీఖె ఉమర్ బిన్ ఖత్తాబ్-ఇబ్నె జూజీ - పుట. 36

https://teluguislam.net



مَا كَانَ لِنَبِيٍّ اَنْ يَّكُوْنَ لَهٗۤ اَسْرٰى حَتّٰى يُثْخِنَ فِى الْاَرْضِ ؕ تُرِيْدُوْنَ عَرَضَ الدُّنْيَا ۖ وَاللّٰهُ يُرِيْدُ الْاٰخِرَةَ ؕ وَاللّٰهُ عَزِيْزٌ حَكِيْمٌ ۝ لَوْلَا كِتٰبٌ مِّنَ اللّٰهِ سَبَقَ لَمَسَّكُمْ فِيْمَاۤ اَخَذْتُمْ عَذَابٌ عَظِيْمٌ ۝

"ధరణిలో శత్రువును పూర్తిగా అణచనంత మట్టుకు, తన వద్ద యుద్ధ ఖైదీలను ఉంచుకోవడం అనేది ఏ ప్రవక్తకూ తగదు. మీరు ప్రాపంచిక ప్రయోజనాలను కాంక్షిస్తున్నారు. కాని అల్లాహ్ (మీ కొరకు) పరలోకాన్ని కాంక్షిస్తున్నాడు. అల్లాహ్ శక్తిమంతుడూ, వివేకవంతుడూను. ముందే గనక అల్లాహ్ ఫర్మానా ఒకటి వ్రాయబడి ఉండకపోతే, మీరు తీసుకున్నదాని పర్యవసానంగా మీకు పెద్ద శిక్ష పడి ఉండేది." (8 : 67,68)

ముందే వచ్చిన ఆ ఫర్మానా ఇది: కనుక మీరు అవిశ్వాసులతో తలపడినప్పుడు, వారి మెడలను ఖండించడమే మీరు చేయవలసిన మొదటి పని. చివరకు మీరు వారిని పూర్తిగా అణచివేసిన తరువాత ఖైదీలను గట్టిగా బంధించండి. ఆ తరువాత (మీకు ఇలా చేసే అధికారం ఉంది)

فَاِمَّا مَنًّۢا بَعْدُ وَاِمَّا فِدَآءً

"వారికి మేలైనా చేయండి లేదా వారి నుండి పరిహారం (సొమ్ము) తీసుకొని వదిలేయండి." (47 : 4)

ఈ ఫర్మానాలో యుద్ధ ఖైదీల నుండి ఫిదియా (పరిహారం) తీసుకునే అనుమతి ఇవ్వడం జరిగింది గనుక, సహాబా (ర)కు ఫిదియా తీసుకున్నందుకు శిక్షించడం జరగలేదు. అది కేవలం ఓ హెచ్చరిక మాత్రమే. ఆ హెచ్చరికైనా ఎందుకు చేయడం జరిగిందంటే, వారు దైవ తిరస్కారుల్ని బాగా అణచక ముందే యుద్ధ ఖైదీలుగా పట్టుకున్నందుకు. అదే కాదు, వారు ఫిదియా తీసుకొని వదలివేసిన యుద్ధ ఖైదీలు మామూలు యుద్ధ ఖైదీలు కాదు. యుద్ధంలో ఓడిన గొప్ప యుద్ధనేరస్తులు కూడా. ఏ ఆధునిక చట్టం అయినా, వారిని న్యాయస్థానం ముందు నిలబెట్టకుండా వదలివేసే నేరస్తులు కారు. ఏ న్యాయస్థానం అయినా వారికి మరణదండన విధించనిదే వదలిపెట్టే అవకాశమే లేదు.

https://teluguislam.net



ఏది ఏమైనా, హజ్రత్ అబూ బక్ర్(ర) గారి సలహా ప్రకారమే వ్యవహారం పరిష్కరించడం జరిగింది. ముష్రిక్కుల నుండి ఫిదియా తీసుకొని వారిని వదలి వేయడమూ జరిగింది. ఫిదియా పరిమాణం నాల్గు వేలు మరియు మూడు వేల దిర్హముల నుండి ఒక వెయ్యి దిర్హమ్‌ల వరకు నిర్ణయించడం జరిగింది. మదీనావాసులు చదువుకున్నవారుకారు. అందుకని, ఎవరైతే ఫిదియా చెల్లించలేదో వారు, మదీనాలోని పదేసి మంది పిల్లలకు చదువు చెప్పాలనే షరతు విధించడం జరిగింది. ఆ పిల్లలు బాగా చదవనూ రాయనూ నేర్చుకుంటే అదే వారి ఫిదియా అవుతుంది అని ప్రకటించడం జరిగింది.

మహాప్రవక్త (స) అనేక మంది యుద్ధ ఖైదీలను కరుణించి ఫిదియా లేకుండానే వదలివేశారు. ఈ జాబితాలో ముతల్లిబ్ బిన్ హన్తిబ్, సైఫీ బిన్ రిఫాఆ, అబూ ఉజ్జా హమ్జీల పేర్లు కూడా ఉన్నాయి. అబూ ఉజ్జా హమ్జీ ఉహద్ యుద్ధంలో బందీ అయి చంపబడ్డాడు (వివరాలు ముందు రాబో తున్నాయి).

దైవప్రవక్త (స)గారి అల్లుడు అబుల్ ఆస్‌ను కూడా తమ కుమార్తె హజ్రత్ జైనబ్(ర) మార్గానికి అడ్డురాకుండా ఉండే షరతుపై వదలివేయడం జరిగింది. దీనికి కారణం ఏమిటంటే, హజ్రత్ జైనబ్ (ర) తన భర్త అబుల్ ఆస్‌ను విడిపించుకోవడానికి దైవప్రవక్త (స) గారి వద్దకు ఓ కంఠహారాన్ని పంపించారు. ఈ హారం, అసలు హజ్రత్ ఖదీజా (ర)గారి కంఠహారం. వివాహం అయిన తరువాత హజ్రత్ జైనబ్(ర)ను అత్తవారింటికి పంపించేటప్పుడు ఆమె మెడలో అలంకరించి పంపించారు. మహాప్రవక్త(స)కు ఆ హారాన్ని చూడగానే దుఃఖం ఆగలేదు. ఆయన(స), ఈ హారానికి బదులు అబుల్ ఆస్‌ను వదలిపెట్టే అనుమతిని కోరారు సహాబా (ర)ను. సహాబా (ర) సంతోషంగా అంగీకరించిన మీదట దైవప్రవక్త(స), అబుల్ ఆస్‌ను వదలిపెట్టడానికి ఓ షరతు పెట్టారు. ఆ షరతు ప్రకారం, అతను హజ్రత్ జైనబ్(ర)ను వదలిపెట్టడం. ఆ షరతునను సరించి అబుల్ ఆస్ ఆమె దారికి అడ్డు తొలగిపోయాడు. అప్పుడుగాని హజ్రత్ జైనబ్ (ర) హిజ్రత్ చేయలేదు. దైవప్రవక్త (స) హజ్రత్ జైద్ బిన్ హారిసా (ర) మరియు మరో అన్సారీ సహాబీని పంపిస్తూ మీరు 'బత్న్' లేదా 'జజ్' అనే ప్రదేశంలో ఆగండి. జైనబ్ (ర) అక్కడకు రాగానే ఆమెను తోడ్కొని మదీనాకు తీసుకురండి అని ఆదేశించారు. వారిద్దరు వెళ్ళి హజ్రత్ జైనబ్‌ను మదీనాకు

https://teluguislam.net



తోడ్కొని వచ్చారు. హజ్రత్ జైనబ్ (ర)గారి హిజ్రత్ సంఘటన బహు బాధా కరమైనది, సుదీర్ఘమైనదీను.

యుద్ధ ఖైదీల్లో సుహైల్ బిన్ అమ్రూ అనేవాడు కూడా ఉన్నాడు. అతను మంచి వక్త కూడా. హజ్రత్ ఉమర్ (ర) అతని విషయంలో మహాప్రవక్త (స)కు ఇచ్చిన సలహా ఏమిటంటే, అతని ముందటి రెండు పళ్ళను విరగొట్టమని. తద్వారా అతని ఉచ్ఛారణ సరిగా ఉండదు, ఆపై మహాప్రవక్త (స)కు వ్యతిరేకంగా ఉపన్యాసాలు ఇవ్వకుండా ఉంటాడని. కాని దైవప్రవక్త (స) ఆయన ఈ అభ్యర్థనను త్రోసిపుచ్చుతూ, ఇది 'ముస్లా' (ముఖాన్ని చెడగొట్టడం) క్రిందికి వస్తుందని, ఇలా చేసినందుకు అల్లాహ్ ప్రళయం రోజున తనను ప్రశ్నిస్తాడని చెప్పారు.

హజ్రత్ సఅద్ బిన్ నోమాన్ (ర) ఉమ్రా చేయడానికి బయలుదేరి నప్పుడు అబూసుఫ్యాన్ ఆయన్ను బందీగా చేశాడు. అబూ సుఫ్యాన్ కుమారుడు అమ్రూ కూడా బద్ర్ యుద్ధ ఖైదీల్లో ఉన్నాడు. అందుకని అమ్రూను అబూ సుఫ్యాన్‌కు అప్పజెప్పి హజ్రత్ సఅద్(ర)ను అతని చెర నుండి విడిపించుకున్నారు.

## దివ్యఖుర్ఆన్ వాక్యాల పునర్విమర్శ

ఈ యుద్ధానికి సంబంధించే ఖుర్ఆన్‌లో అన్ఫాల్ అధ్యాయం (సూరా) అవతరించింది. ఇది యదార్థంగా ఈ యుద్ధం గురించి అల్లాహ్ చేసిన సమీక్ష అని చెప్పవచ్చు - ఇదే నిజమైతే ఈ పునర్విమర్శ రాజులు, కమాండర్ల విజయా లపై చేసే సమీక్షకు పూర్తిగా భిన్నమైన సమీక్ష. ఈ సమీక్షలోని కొన్ని అంశాలు ఇవి:

అల్లాహ్ మొట్టమొదట ముస్లిముల్లో మిగిలిపోయిన తప్పుల్ని, వారి నైతిక లోపాలను చూపెట్టడం జరిగింది. ఆ తప్పులు ఈ సందర్భంలో వారి ద్వారా దొరలిపోయాయి. ఈ హెచ్చరికను చేసి అల్లాహ్ వారిలో ఉన్న బలహీన తల్ని తొలగించి, సంపూర్ణ వ్యక్తిత్వం గలవారుగా మలచదలుచుకున్నాడు.

ఆ తరువాత ఈ విజయంలో అల్లాహ్ చేసిన సహాయాన్ని, పరోక్షంగా వారికి అందించిన సహకారాన్ని గుర్తుచేస్తూ, ముస్లిములు తమ ధైర్యశౌర్యాలను చూసి విఱ్ఱవీగకూడదు అని చెప్పడం. అప్పుడప్పుడు వారి మనస్సుల్లో గర్వం

https://teluguislam.net



ఏర్పడవచ్చు. కాబట్టి ఇక నుండి వారు అల్లాహ్‌నే నమ్ముకుని దైవప్రవక్త (స)కు విధేయత చూపుతూ ఉండాలి.

ఆ పిదప దైవప్రవక్త (స) ఏ మహోన్నతమైన లక్ష్యాలను, అవసరాలను దృష్టిలో ఉంచుకొని ఈ యుద్ధరంగంలో కాలిడారో, ఆ లక్ష్యాలు మరియు ఆ అవసరాలు ఏమై ఉంటాయో, అవి ఇలాంటి యుద్ధాలలో ఎలా విజయాన్ని చేకూర్చిపెడతాయో చెప్పడం జరిగింది.

ఆ తరువాత ముష్రిక్కులను, యూదుల్ని మరియు యుద్ధ ఖైదీలను సంబోధిస్తూ, వారు సత్యం ముందు వంగిపోయి దాన్నే అనుసరించాలని హితవు చెప్పడం జరిగింది.

ఆ పిదప ముస్లిములను సంబోధిస్తూ, లభించిన యుద్ధ ధన సమస్యను పరిష్కరించుకోడానికి అవసరమైన మౌలిక సూత్రాలను, విధానాలను బోధించడం జరిగింది.

అదే కాదు, ఇస్లామీయ సందేశ ప్రచారంలో అవలంబించవలసిన యుద్ధం మరియు సంధికి అవసరమైన చట్టాలను చెప్పడం జరిగింది. ఈ చట్టాలు, విధానాలను ఉపయోగించుకొని అజ్ఞానులు (అంటే ఇస్లామ్ ధర్మాన్ని కాదని తమ తాతముత్తాతల మార్గంపై నడిచేవారు) మరియు ముస్లిములలో గల తేడా ప్రస్ఫుటంగా అగుపడాలని చెప్పడం జరిగింది. నైతికతా విలువల్లో మరియు నడవడికలో ముస్లిములకే ఆధిక్యత ఉండాలి, ఇస్లామ్ కేవలం ఒక సైద్ధాంతిక మతం కాదు, ఏ సిద్ధాంతాల వైపునకు, సూత్రాల వైపునకు అయితే అది ఆహ్వానిస్తుందో దాన్ని పూర్తిగా ఆచరించి చూపెట్టే ధర్మం అని ప్రపంచానికి తెలిసిపోవాలి. అది నమ్మిన సూత్రాలకు అనుగుణంగా నడవడానికి ప్రతి ముస్లిమ్‌కు శిక్షణ కూడా ఇస్తుందని ప్రపంచం గ్రహించాలి.

ఈ అధ్యాయంలో ఇస్లామీయ చట్టానికి సంబంధించిన అనేక అధికరణలను కూడా తెలుపుతూ, దీని ద్వారా ఇస్లామీయ ప్రభుత్వ పరిధిలో నివసించే ముస్లిములకు, దానికి వెలుపల నివసించే ముస్లిములకు గల తేడా ఏమిటో విడమర్చి చెప్పడం జరిగింది.

## పరోక్ష సంఘటనలు

హిజ్రీ శకం రెండులో రమజాన్ ఉపవాస దీక్ష మరియు సద్‌ఖయె ఫిత్ర్ (ఫిత్రా దానం) విధిగా చేయడం జరిగింది. అదేకాకుండా జకాత్ దానానికి సంబంధించిన పరిమాణాలు ఏమిటో తెలుపడం జరిగింది. ఫిత్రా దానం

https://teluguislam.net



మరియు జకాత్ చెల్లించే కనీస ఆదాయ పరిధిని నిర్ణయించడం వలన అనాథలు, నిస్సహాయులు, ముహాజిర్లు అనుభవిస్తున్న కష్టాల భారం కొంత తగ్గిపోయింది. ఎందుకంటే వీరు తమ ఉపాధిని పొందేందుకు మార్గాలులేక బాధపడుతుండేవారప్పుడు.

ఓ శుభ సందర్భంలో సంభవించిన మరో ఆసక్తికరమైన సంఘటన ఏమిటంటే, ముస్లిములు తమ జీవితంలోనే మొట్టమొదటి 'ఈద్' ఏదైతే జరుపుకున్నారో, అది షవ్వాల్ మాసం రెండవ హిజ్రీ శకంలో జరుపుకున్న ఈద్. అది బద్ర్ యుద్ధ విజయం తరువాత వచ్చిన పర్వదినం. ఎంత ఆనందమయమైనదీ ఆ సుదినం! ఆ సంతోష సమయంలోనే అల్లాహ్ వారి తలలపై విజయ కిరీటాన్ని అలంకరించింది. ఆ పండుగ వాతావరణం ఎంత ఆహ్లాదకరంగా, విశ్వాసాన్ని ఇనుమడింపజేసేదిగా ఉంది! ముస్లిములు తమ ఇళ్ళ నుండి బయటకు వచ్చి దైవనామ స్మరణ చేస్తూ ఈద్గాహ్‌కు వెళ్ళి ఈద్ నమాజును చేసిన ఆ దృశ్యం ఎంత ఆహ్లాదాన్ని కలిగించిందో. ఆ సందర్భంలో ముస్లిముల హృదయాలు, అల్లాహ్ ఒసగిన వరాలు, ఆయన అందిం చిన సహాయం వల్ల భారంగా అణిగిపోతున్నాయి. వారి నొసళ్ళు ఆయన కృతజ్ఞతకు భూమిపై ఆని ఉన్నాయి. అల్లాహ్ ఈ వరాన్ని గురించి ఈ ఆయత్‌లో ఇలా వివరించాడు:

وَاذْكُرُوٓا۟ إِذْ أَنتُمْ قَلِيلٌ مُّسْتَضْعَفُونَ فِى ٱلْأَرْضِ تَخَافُونَ أَن يَتَخَطَّفَكُمُ ٱلنَّاسُ فَـَٔاوَىٰكُمْ وَأَيَّدَكُم بِنَصْرِهِۦ وَرَزَقَكُم مِّنَ ٱلطَّيِّبَٰتِ لَعَلَّكُمْ تَشْكُرُونَ ﴿٢٦﴾

"జ్ఞాపకం తెచ్చుకోండి ఆ సమయాన్ని, అప్పుడు మీరు అల్పసంఖ్యలో ఉండేవారు, భూమి మీద మీరు దుర్బలులుగా పరిగణించబడేవారు, మిమ్మల్ని ప్రజలు రూపుమాపుతారేమో అని భయపడుతూ ఉండేవారు, తరువాత అల్లాహ్ మీకు ఆశ్రయ స్థలాన్ని సమకూర్చాడు. తన సహాయంతో మీ చేతులకు బలం చేకూర్చాడు. మీకు మంచి ఉపాధిని ఏర్పాటు చేశాడు. బహుశా మీరు కృతజ్ఞతలు చూపుతారేమోనని." (8 : 26)